

ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్ము ఒక రోజు ముందే పంపిణీ

అనకాపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): జూన్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబ్బులను ఒకరోజు ముందే... శనివారం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు డీఆర్డీఏ పీడీ శచీదేవి తెలిపారు. జిల్లాలో2,54,962 మందికి రూ.107.46 కోట్లు పంపిణీ చేయడానికి నిధులు విడుదల అయ్యాయని, సచివాలయాల సిబ్బంది శనివారం ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ నెలలో కొత్తగా మంజూరైన 3,168 మందికి జూన్ 12న పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తామని తెలిపారు.

పీఎంశ్రీతో స్కూళ్లకు కొత్త రూపు

జిల్లాలో మూడు విడతల్లో 40 పాఠశాలలు ఎంపిక

- రూ.9 కోట్ల అంచనాతో పనులు ప్రారంభం
- అదనపు వసతి, ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, కిచెన్ గార్డెన్లు ఏర్పాటు
- భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు
- చివరి దశలో పనులు.. స్కూళ్లు తెరిచేనాటికి పూర్తి



పీఎంశ్రీ పథకం కింద రాంబిల్లి కేజీబీవీలో నిర్మించిన అదనపు తరగతి గదులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఎంపిక చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో అధునాతన మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో జిల్లా వ్యాప్తంగా 40 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.9 కోట్లతో అంచనాలతో పనులు చేపట్టారు. ఇందుకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వ 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ 40 శాతం భరించాల్సి ఉంటుంది. జిల్లాలో చేపట్టిన పనులు తుది దశకు చేరాయి. జూన్ రెండో వారంలో స్కూళ్లు తెరిచేనాటికి పనులు పూర్తి చేయించడానికి జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు కృషి చేస్తున్నారు.

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ప్రత్యేక చొరవతో జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద తొలి విడతలో 24, రెండో విడతలో 11, మూడో విడతలో ఐదు.. మొత్తం 40 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వ వాటా కింద జిల్లాకు రూ.7.4 కోట్లు విడుదలయ్యాయి. ఆయా పాఠశాలల్లో అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి పాఠశాలల్లో సైన్స్ విద్యార్థుల కోసం ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ప్రయోగశాలకు రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు కేటాయించారు. ప్రతి పాఠశాలలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నారు. దీనికి రూ.1.5 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ప్రత్యేకంగా కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ల్యాబ్‌కు 10 డెస్క్‌టాప్ కంప్యూటర్లు అందించనున్నారు. అన్ని పాఠశాలల్లో వర్షపు నీటిని సంరక్షించి, భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ పండించే కూరగాయలను విద్యార్థుల భోజనం కోసం వినియోగిస్తారు. బాలబాలికల విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. మరుగుదొడ్లకు మరమ్మతు పనులు చేపట్టారు. పాఠశాలల నిర్వహణ కోసం ద్యార్థుల సంఖ్యను బట్టి రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు నిధులు ఇవ్వనున్నారు.



రాంబిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న కెమిస్ట్రీ ల్యాబ్

ప్రైవేటుకు దీటుగా వసతులు



పీఎంశ్రీ పథకంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఆధునిక బోధనోపకరణాలను సమకూర్చుతున్నాం. అవసరమైన చోట అదనపు గదుల నిర్మాణం, సైన్స్ ప్రయోగశాలలు, డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు పనులు చివరి దశకు చేరుకున్నాయి. జూన్‌లో పాఠశాలలు తెరిచేనాటికి పూర్తవుతాయి.

డాక్టర్ ఆర్.జయప్రకాశ్, ఏపీసీ, సమగ్ర శిక్ష

108 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహం

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని తంగేటి శ్రీనివాస కల్యాణమండంలో శుక్రవారం 108 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహ మహోత్సవాన్ని నిర్వహించారు. వికాస తరంగిణి కేంద్ర కమిటీ, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముఖ్యఅతిథులుగా హాజరై మంగళసూత్రాలు అందించి, వధూవరులను ఆశీర్వదించారు. అంతకుముందు సమీపంలో వున్న అల్లూరి సీతారామరాజు పార్కుకు వెళ్లి అల్లూరి, గంటందొర సమాధులను, మ్యూజియంను తిలకించారు.



నూతన వధూవరులకు చిత్రపటాన్ని అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంగళసూత్రాలను పంపిణీ చేస్తున్న చిన్న జీయరుస్వామి. -వార్త 8వ పేజీలో

కుండపోతగా వాన!

ఉదయం ఎండ, మధ్యాహ్నం తరువాత భారీ వర్షం

- ఉరుములు, పిడుగులు, ఈదురు గాలులు
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- వర్షం నీటితో కాలువలను తలపించిన రహదారులు



వర్షం నీటితో పంట కాలువను తలపిస్తున్న నర్సీపట్నం మెయిన్ రోడ్డు



వర్షం నీటితో చెరువును తలపిస్తున్న కోటవురట్ల మెయిన్ రోడ్డు

అనకాపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్):

జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసి, ఉక్కపోత వాతావరణం నెలకొంది. ఆ తరువాత ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు మొదలయ్యాయి. కొద్దిసేపటికే ఉరుములు, పిడుగులతో వర్షం మొదలైంది. నర్సీపట్నం, మాడుగుల, చోడవరం, పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది. నర్సీపట్నంలో రెండు గంటలపాటు కుంభవృష్టిగా వాన పడింది. డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ సరిగా లేకపోవడంతో మురుగు కాలువలు పోటెత్తి రోడ్లపైకి ప్రవహించాయి. సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు రహదారి మొత్తం ముంపునకు గురైంది. పలు వార్డుల్లో మోకాటిలోతున నీరు ప్రవహించింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కొంతసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రావికమతం మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాసింది. తరువాత వాతావరణం మారిపోయి కుండపోతగా వాన కురిసింది. పొలాలు, చెరువుల్లో నీరు చేరింది, దేవరాపల్లి మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం పడింది. నాగయ్యపేట శివారు సీతంపేటలో పలు వీధులు నీటమునిగి, ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. వస్తువులు, ధాన్యం బస్తాలు తడిసిపోయాయని రైతులు వాపోయారు. మాకవరపాలెం మండలంలో భారీ వర్షం పడింది. అంతకుముందు ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం తరువాత భారీ వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం చెందారు. ఖరీఫ్‌లో చిరు ధాన్యాలు, పప్పుదినుల పంటలు సాగు చేయడానికి ఈ వర్షం దోహదం చేస్తుందని రైతులు ... మిగతా 6వ పేజీలో



రావికమతం మండలం కొమిరలో కురుస్తున్న వర్షం

రోడ్డుపై రేషన్‌కు చెల్లుచీటీ!

మూలకు చేరిన ఎండీయూ వాహనాలు

- రేపటి నుంచి చౌక ధరల దుకాణాల్లో సరకుల పంపిణీ
- పక్షం రోజుల్లో ఎప్పుడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు
- ఉదయం నాలుగు, సాయంత్రం నాలుగు గంటలపాటు డిపోలు ఓపెన్
- వీధుల్లో నిరీక్షించాల్సిన దుస్థితి తప్పిందని కార్డుదారులు సంతోషం

అనకాపల్లి కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి):

రేషన్ సరకులు అందించే ఎండీయూ వాహనం ఎప్పుడొస్తుందా అని కార్డుదారులు ఎదురు చూడాల్సిన అవసరం లేదు. రేషన్ కోసం బియ్యం కార్డుదారులు వీధుల్లో, రోడ్లపైన నిరీక్షించాల్సిన పనిలేదు. ఐదారేళ్ల క్రితం మాదిరిగానే తమకు వెసులుబాటు వున్న సమయంలో చౌక ధరల దుకాణానికి వెళ్లి సరకులు విడిపించుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ ఒకటి నుంచి రేషన్ డిపోల్లోనే సరకుల పంపిణీకి పౌరసరఫరాల శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలోని అన్ని డిపోలకు ఇప్పటికే సరకులు చేరాయి.

జిల్లాలో ప్రస్తుతం 1,069 చౌకధరల దుకాణాల పరిధిలో 5,37,038 రేషన్ కార్డులు వున్నాయి. గత ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పేరుతో ఎండీయూ వ్యవస్థను తీసుకువచ్చింది. రేషన్ డిపోలకు వెళ్లాల్సిన పనిలేదని, కార్డుదారుల ఇళ్ల వద్దకు వ్యాన్ వచ్చి రేషన్ అందజేస్తారని ప్రకటించింది. కానీ ఆచరణలోకి వచ్చేసరికి నాటి ప్రభుత్వం చెప్పినట్టు జరగలేదు. ఎండీయూ వాహనాలు వీధి చివరిలో, కూడలిలో లేదంటే వైసీపీ నాయకుల ఇళ్ల వద్ద నిలిపేవారు. కార్డుదారులు అక్కడకు వెళ్లి రోడ్డుపై క్యూలో నిల్చుని సరకులు తీసుకోవాల్సి వచ్చేది. ఆ సమయంలో కూలి పనులు, ఇతర కారణాల వల్ల ఇళ్ల వద్ద లేకపోతే మరుసటి రోజు ఎండీయూ వాహనం ఎక్కడుందో కనుక్కొని అక్కడకు, ఎక్కువ సేపు క్యూలో నిల్చుని సరకులు తీసుకోవాల్సి వచ్చేది. దీంతో రోజు వారీ కూలి పనులకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొన్నిసార్లు సరకులు తీసుకోలేని పరిస్థితి ఏర్పడేది. అంతేకాక ఎండీయూ ఆపరేటర్లు.. కార్డుదారుల నుంచి నామ మాత్రపు ధరకు బియ్యం కొనుగోలు చేసేవారు. ఐపోస్ యంత్రంలో వేలి ముద్ర వేయించుకుని కిలోకు రూ.10-12 ఇచ్చేవారు. అనంతరం ఆ బియ్యాన్ని దొడ్డిదారిన దళారులకు, రైస్ మిల్లర్లకు కిలో రూ.15-20 వరకు ... మిగతా 6వ పేజీలో



అనకాపల్లి మండలం భట్లపూడిలోని రేషన్ దుకాణానికి చేరిన సరకులు

విద్యుత్ సరఫరా మెరుగుకు కసరత్తు

- ఎక్కడికక్కడే ఫీడర్ల విభజన
- కొత్తగా సబ్ స్టేషన్ల నిర్మాణం
- జూన్ నెలాఖరుకల్లా పూర్తి చేయడానికి ఈపీడీసీఎల్ అధికారుల ప్రణాళిక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలో విద్యుత్ సరఫరా మెరుగుకు ఈపీడీసీఎల్ అధికారులు విస్తృతంగా పనులు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద నిధులు మంజూరు చేయడంతో గడువులోగా ఆయా పనులను పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఎక్కడైతే విద్యుత్ లోడ్ అధికంగా పడుతుందో గుర్తించి ఆయా ఫీడర్లపై భారాన్ని ... మిగతా 6వ పేజీలో



ఎలమంచిలి సబ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పనులు

జూలై 9న సింహగిరి ప్రదక్షిణ - 6లో

యువతి హత్య కేసులో వీడిన మిస్టరీ

ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

- రెండున్నరేళ్ల క్రితం ఎలమంచిలి హైవే పక్కన గుర్తు తెలియని యువతి మృతదేహం
- ఆనవాళ్లు లభించకపోవడంతో చాలా కాలంపాటు ముందుకు సాగని దర్యాప్తు
- ఎట్టకేలకు ఆధారాలు లభించడంతో నిందితుల అరెస్టు
- హత్యకు గురైన యువతి సొంతూరు పూడిమడక



మీడియా సమావేశంలో డీఎస్పీ విష్ణుస్వరూప్, పోలీసు అధికారులు, వెనుక వరుసలో నిందితులు



ఎల్లబిల్లి దివ్య (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, మే 30 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి సమీపంలో జాతీయ రహదారి పక్కన రెండున్నరేళ్ల క్రితం జరిగిన యువతి హత్య కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఇక్కడ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ వెల్లడించారు.

ఎలమంచిలి సమీపంలో జాతీయ రహదారి పక్కన బీపీసీఎల్ పెట్రోలు బంకు సమీపంలో గుర్తు తెలియని ఒక మృతదేహం కాలిపోయిన స్థితిలో వున్నట్టు 2023 సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీన పోలీసులకు సమాచారం వచ్చింది. అప్పటి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఎటువంటి ఆనవాళ్లు లభించకపోవడంతో తొలుత హిజ్రాగా భావించి కేసు దర్యాప్తును కొనసాగించారు. ఈ నేపథ్యంలో అనకాపల్లిలో వృద్ధురాలి వద్ద వుంటున్న ఆమె మనవరాలు ఎల్లబిల్లి దివ్య (20) అదృశ్యమైనట్టు సమాచారం రావడంతో ఆ దిశగా దర్యాప్తు చేశారు. ఈమె సొంతూరు అచ్యుతాపురం మండలం పూడిమడక అని, తల్లి లేకపోవడం, తండ్రి వేరే ప్రాంతంలో ఉద్యోగం చేస్తుండడంతో అనకాపల్లిలో అమ్మమ్మ వద్ద పెరుగుతున్నట్టు గుర్తించారు. గురుకుల పాఠశాలలో ఇంటర్ వరకు చదివి, అనంతరం ఖాళీగా వున్నట్టు సమాచారం సేకరించారు. అయితే యువతిని ఎవరు హత్య చేస్తారన్నదానిపై ... మిగతా 6వ పేజీలో

ఏసీబీకి చిక్కిన వాణిజ్య పన్నుల అధికారిణి

ప్లై ఉడ్ మెటీరియల్ రిలీజ్ ఆర్డర్ జారీకి రూ.30 వేలు డిమాండ్

- చివరకు రూ.25 వేలకు ఫైనల్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి ద్వారా లంచం డబ్బులు వసూలు
- దాడి చేసి పట్టుకున్న ఏసీబీ అధికారులు

లంకెలపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి):

హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకున్న ప్లైఉడ్ మెటీరియల్ విడుదల (రిలీజ్ ఆర్డర్) చేసేందుకు లంచం డిమాండ్ చేసిన వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ (డీసీటీవో) కిముడు జయలక్ష్మిని అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆమె అనుచరుడైన కాళేశ్వరి ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి సన్యాసిరాజు రూ.25 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి.

హైదరాబాద్‌కు చెందిన ఇంటీరియర్ డిజైన్ వర్క్ కాంట్రాక్టర్ విశ్వేశ్వర విశ్వనాథ్ విశాఖలో ఇంటీరియర్ డిజైన్ వర్కులు చేస్తుంటారు. ఇందుకోసం రూ.42 వేల విలువ చేసే ప్లై ఉడ్ మెటీరియల్‌ను ఇటీవల హైదరాబాద్‌లో కొనుగోలు చేసి కాళేశ్వరి ట్రాన్స్‌పోర్టు ద్వారా విశాఖ పంపించారు. ఇది వన్‌టౌన్‌లోని ట్రాన్స్ పోర్టు గోదాముకు చేరింది. అక్కడి నుంచి ... మిగతా 6వ పేజీలో



ఏసీబీకి చిక్కిన డీసీటీవో విజయలక్ష్మి

క్రీడాకారులకు వైద్య పరీక్షలు


పరీక్షలు జరుపుతున్న వైద్యులు

అచ్యుతాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు నిత్యం వ్యాయాం చేస్తుండడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉండడమే కాకుండా లక్ష్య సాధనకు దోహదపడుతుందని ప్రముఖ వైద్యాధికారి డాక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం ఇక్కడ క్రీడాకారులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందికి వివిధ రకాల పరీక్షలు జరిపి, ఆరోగ్య సూత్రాలను వివరించారు. వీరికి మౌత్ వాష్, టూత్ బ్రష్ తదితరాలను అందజేశారు. వైద్యాధికారులు మౌనిక, సత్యతో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు, ఉమాశంకర్, ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ సాంకేతికత- వికసిత్ భారత్ ప్రాజెక్టుకు ప్రశాంతి విద్యా సంస్థలు ఎంపిక

అచ్యుతాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం ఇక్కడి ప్రశాంతి విద్యా సంస్థలకు స్వదేశీ సాంకేతికత- వికసిత్ భారత్‌లో భాగంగా రూ.84.65లక్షల భారీ ప్రాజెక్టును మంజూరు చేసిందని ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి ఎంపిక చేసిన ప్రాజెకులకు ఐఐటీ హైదరాబాద్‌లో గత ఏడాది అక్టోబర్‌లో ప్రజెంటేషన్ నిర్వహించగా, రాష్ట్రం నుంచి తమ విద్యా సంస్థను ఎంపిక చేశారన్నారు. తమ విద్యా సంస్థల్లో మెకానికల్ విభాగాధిపతి ఉప్పటి మధుసూదన్‌రావు పర్యవేక్షణలో రెండేళ్ల పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో స్వదేశీ సాంకేతికతపై ప్రదర్శనలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తారని ప్రసాద్ వెల్లడించారు.

స్వయంశక్తి సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రణాళికలు

» కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్



సమావేశంలో పాల్గొన్న కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, సంయుక్త కార్యదర్శి ముక్తాశేఖర్, రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో స్వయంశక్తి సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రణాళికలు అమలుచేయాలని కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు. శుక్రవారం రాడిసిన్‌బ్లూ హోటల్‌లో పంచాయతీ, మండల పరిషత్ ప్రతినిధులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ స్వయంశక్తి ఉపాధి మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించిన పంచాయతీలలో సంఘాలకు లాభదాయకమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రణాళికలు పక్కాగా అమలుచేయాలన్నారు. సదస్సు నిర్వహణలో భాగంగా ఎంపిక చేసిన 88 మంది సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. సదస్సులో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తాశేఖర్, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, పలువురు జడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఎంపీడీవోలు, సర్పంచులు పాల్గొన్నారు.

మార్టూరు రోడ్డులో ట్రాఫిక్ జామ్

» కర్మాగారాలకు చెందిన డ్రైవర్లు దూరం తగ్గుతుందని సింగల్ రోడ్డుకు వాహనాల మళ్లింపు » ఇదే రూటును మరింత మంది ఆశ్రయించడంతో సమస్య
» సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇదే పరిస్థితి » పోలీసుల చొరవతో ఎట్టకేలకు క్లియర్ కావడంతో ఊపిరి పీల్చుకున్న వాహనదారులు


మార్టూరు రోడ్డులో ట్రాఫిక్ జామ్ కావడంతో భారీగా నిలిచిపోయిన వాహనాలు

అచ్యుతాపురం, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు తరచూ తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. శుక్రవారం సాయంత్రం ఇదే పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వైపు వెళ్లే రోడ్డులోనే కర్మాగారాలున్నాయి. యంత్రాలతో వచ్చే భారీ వాహనాలతో పాటు కార్మికులు, ఉద్యోగులను తీసుకువెళ్లే బస్సులు, ఇతర వాహనాలు అచ్యుతాపురం జంక్షన్ గుండానే వెళ్లాల్సి ఉంటుంది. శుక్రవారం ఉదయం అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వెళ్లే రోడ్డులో ఒకపక్క వాహనాల రాకపోకలకు దారిచ్చారు. పూడిమడక రోడ్డు నుంచి అచ్యుతాపురం వచ్చే వాహనాలకు సెజ్ ముఖ ద్వారం నుంచి యూనిపార్ట్ కర్మాగారం, ఫైలురాయి వంతెన, సెజ్ పునరావాస కాలనీ మీదుగా వెంకటాపురం జంక్షన్ వద్ద గల ఎలమంచిలి- అచ్యుతాపురం ప్రధాన మర్గానికి మళ్లించారు. సెజ్‌ముఖద్వారం నుంచి వెంకటాపురం జంక్షన్ వరకు డబుల్ రోడ్డు ఉంది. దీంతో ఉదయం నుంచి వాహనాలు అటు వైపేవెళ్లాయి. వెంకటాపురం జంక్షన్ నుంచి ఎలమంచిలి వెళ్లే వాహనాలు ఎలమంచిలి వైపు, అచ్యుతాపురం, అనకాపల్లి, గాజువాక వైపు వెళ్లే వాహనాలు వెదురువాడ, అచ్యుతాపురం జంక్షన్ మీదుగా వెళ్లాయి. సెజ్ పునరావాస కాలనీ వద్ద నుంచి మార్టూరు మీదుగా అచ్యుతాపురం అయ్యప్ప స్వామి ఆలయం వరకు సింగిల్ రోడ్డుఉంది. శుక్రవారం సాయంత్రం సెజ్ కర్మాగారాల్లో విధులు ముగించుకొని గమ్యస్థాలను తీసుకువెళ్లాల్సి బస్సులను మార్టూరు రోడ్డు గుండా మళ్లించారు. ఇది ఇరుకు రోడ్డు కావడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. లారీలు, బస్సులు, కార్లు తదితర వాహనాలు బారులుతీరి నిలిచి పోయాయి. సెజ్ పునరావాస కాలనీ, వెంకటాపురం జంక్షన్ వెదురువాడ మీదుగా వస్తే ఎనిమిది కి.మీ. ఎక్కువ అవుతుంది. ఈ కారణంగా సెజ్ కార్మికులను తీసుకువెళ్లే బస్సు డ్రైవర్లు పలువురు దగ్గర దారికావడంతో మార్టూరు రోడ్డుకి వాహనాలు తిప్పేశారు. వీటిని చూసి సెజ్ కర్మాగారాల నుంచి వచ్చే భారీ వాహనాలు సైతం మార్టూరు రోడ్డుకి రావడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించి అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం ఐదున్నర గంటల నుంచి రాత్రి ఏడున్నర గంటల వరకు ట్రాఫిక్ క్లియర్ కాలేదు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహాలకు అభిషేకం చేస్తున్న విజయకుమార్ దంపతులు

అచ్యుతాపురం, మే 30(ఆంధ్రజ్యోతి): సెజ్ పునరావాస కాలనీ దిబ్బపాలెంలో శక్తివేల్ సుబ్రహ్మణ్యేశ్వర సహిత కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దంపతులు హాజరై హోమాలతో పాటు విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, తుమ్మల రాజుతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రభుత్వాలు కృషి'


కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

రాంబిల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం రాంబిల్లిలో యోగాంధ్ర శిక్షణ తరగతులు శుక్రవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఎంపీడీవో జయమాధవి ఆధ్వర్యంలో పలు శాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బందికి యోగాసనాలు, ధ్యానంపై శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాకు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఒత్తిడి సమయంలో యోగా ప్రక్రియ మానసిక ప్రశాంతతను చేకూర్చుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రాజు, వెలుగు ఏపీఎం పద్మ, పలు శాఖల ఉద్యోగులుపాల్గొన్నారు.

ఇదిలావుంటే, అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మండలంలోని కొత్తూరు బౌద్ధక్షేత్రం ఆవరణలోని ధన దిబ్బవద్ద వచ్చే నెల తొమ్మిదో తేదీన జరగనున్న నియోజకవర్గ స్థాయి యోగా కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను టీడీపీ రాంబిల్లి మండల నాయకుడు వి.దిన్‌బాబు ఉపాధి పథకం ఏపీవో శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ వేడుకకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, పలు శాఖలకు చెందిన ఉద్యోగులు, ప్రజలు సుమారు రెండు వేల మంది వరకు పాల్గొంటారని దిన్‌బాబు తెలిపారు. ఈకార్యక్రమంలో పాల్గొనే వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు.

ప్రతి గ్రామంలో యోగా తరగతులు

మునగపాక : ప్రతి గ్రామ పంచాయతీలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి సూచించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆమె కార్యాదర్శులతో సమావేశమ య్యారు. ప్రతి గ్రామంలో అనువైన ప్రదేశాల్లో యోగాసనాల ద్వారా శిక్షణ ఇవ్వాలన్నారు.

పౌష్టికాహారంపై బాలికలకు అవగాహన కల్పించాలి


సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

మునగపాక, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రం-2లో శుక్రవారం కిశోర్ వికాస్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ అన్నపూర్ణ మాట్లాడుతూ పదకొండు సంవత్సరాల నుంచి పద్దెనిమిది సంవత్సరాలలోపు బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా పౌష్టికాహారం, సమాజంలో నడవడిక, ఆర్థిక అంశాలు, పొదుపు వంటిపై వారిలో చైతన్యం కలిగించాలని సూచించారు. ఈ సదస్సులో అంగన్‌వాడీ టీచర్లు పెంటకోట హేమలత, టెక్కలి సరస్వతి, బొడ్డేడ పద్మ, వీవోలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



అచ్యుతాపురంలో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం/ ఎలమంచిలి, మే 30 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. అచ్యుతాపురంలో జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము యూనియన్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులకు వ్యతిరేకంగా కార్మిక చట్టాలను మార్చిందన్నారు. దీనిని అంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు కర్రి నాయుడు, రమేష్, గణేష్, వి.ప్రకాష్, రావాడ శ్రీను, హనుమంతు, ఎ.కొండలరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎలమంచిలిలోని లైను కొత్తూరు బ్రిక్స్ పరిశ్రమ సమీపంలో, ధర్మవరం కాలనీలో యూనియన్ జెండాను మండల కార్యదర్శి చింతకాయల శివాజీ ఆవిష్కరించారు. యూనియన్ ఆవిర్భావం నుంచి చేపట్టిన పోరాటాలను వివరించారు. కార్మిక నాయకులు శశికళ, సత్యనారాయణ, చిరంజీవి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం


కోదండరామస్వామి, లక్ష్మణుడు, సీతాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించిన దృశ్యం

పాయకరావుపేట రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరాంభద్రపురం గ్రామంలో శుక్రవారం కోదండ రామ విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఆగమ పండితులు వాడపల్లి గోపాలాచార్యస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం సత్యనారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు ఈ మహోత్సవం నిర్వహించారు. కోదండరాముడు, లక్ష్మణుడు, సీతాదేవి విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, జూరెడ్డి రమేశ్, గొల్లపల్లి నాగు, శింగంశెట్టి నాగేశ్వరరావు, కలిగట్ల శ్రీనువాసరావు, నారపురెడ్డి కొండబాబు, తాడి రామకృష్ణ, తాడి సూరిమూర్తి, తాడి నర్సింహమూర్తి, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ త్రిపర్ణ సత్యనారాయణ, త్రిపర్ణ రాజబాబు, దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విత్తన ఉత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్

పాయకరావుపేట రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): రైతులు యాంత్రీకరణ పద్ధతులను పాటించాలని, తద్వారా నాణ్యమైన విత్తన ఉత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ సూచించారు. మండలంలోని శ్రీరాంపురం, కేశవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖ, బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆమర ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, కొబ్బరిలో విత్తనోత్పత్తి, విత్తన ఎంపిక, భూసార పరిరక్షణకు అంతర పంటల యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే బీసీటీ కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు బండి నాగేశ్వరరావు, డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూసార సంరక్షణ, కొబ్బరి, వరి పంటలలో ముందస్తు సస్యరక్షణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది వీరబాబు, నాగశరత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జోగారావు పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం


కోటవురట్ల ప్రధాన రహదారిపై హోరున కురుస్తున్న వాన

కోటవురట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. నాలుగైదు రోలుగా ఎండలు మండిపడుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పలు గ్రామాల్లో మధ్యాహ్నం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చి కుండపోత వాన పడింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు, పొంగి ప్రవహించడంతో చెరువుల్లోకి కొత్త నీరు వచ్చి చేరుతున్నది. మండల పరిషత్ కార్యాలయం వద్ద వర్షం నీరు నిలిచి పోయింది. శుక్రవారం 77.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. భూగర్భ జలాల్లో నీటిమట్టం గణనీయంగా పెరుగుతుందని అధికారులు అంటున్నారు.


ధర్మవరం అగ్రహారంలో ప్రధాన రహదారిపై చెరువును తలపిస్తున్న వర్షపు నీరు

నక్కపల్లిలో..

నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కబోత, ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించింది. సాయంత్రం ఆకాశంపై దట్టమైన మేఘాలు కమ్ముకుని గంటసేపు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో పలు గ్రామాల్లో రహదారులు చెరువులను తలపించాయి. అంతేకాకుండా కొంత సమయం పాటు గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్లల్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

నేడు ఉద్దండపురంలో హోం మంత్రి పెన్షన్ల పంపిణీ

నక్కపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురం గ్రామంలో శనివారం ఉదయం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతారని హోం మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే శనివారం పెన్షన్ల పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు హోం మంత్రి ఉద్దండపురం గ్రామంలో ఉదయం పర్యటించి లబ్ధిదారులకు నేరుగా పెన్షన్ల పంపిణీ చేపడతారని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ చెప్పారు.

సాగుదారులకు న్యాయం చేయండి

నక్కపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీఎల్ పురం సర్వే నంబరు-85 భూముల్లో సాగులో ఉన్న రైతులకు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ సర్వే నంబరులో ఉన్న రైతులతో శుక్రవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ భూములను ఏపీఐఐసీ తీసుకోవడంతో సాగులో వున్న వారికి న్యాయం జరగడం లేదని వాపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజేశ్, డీఎల్ పురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు జి.వెంకటరమణ, పిక్కి గంగరాజు, పిక్కి సత్తియ్య, కోదండరావు, వి.శివ, చిట్టిబాబు, చిరంజీవి, బాబ్జీ, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ఎస్.రాయవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం అగ్రహారం జడ్పీహెచ్ పాఠశాలకు అడ్డరోడ్డులోని ప్రజ్ఞ జూనియర్ కళాశాల యాజమాన్యం కంప్యూటర్‌ను వితరణగా ఇచ్చింది. హెచ్ఎం శ్రీనివాసరావుకు ఈ కంప్యూటర్‌ను అందించారు.

ఘనంగా నూకాలమ్మ జాతర


నూకాలమ్మను దర్శించుకున్న చిక్కాల రామారావు తదితరులు

పాయకరావుపేట రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటకోట గ్రామంలో గురువారం రాత్రి నూకాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. వేట విరామం ,అనంతరం వేట ప్రారంభమయ్యే కొద్ది రోజులు ముందు మత్స్యకారులందరూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జాతరను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. మందుగుండు సామగ్రిని కాల్చారు. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సాయి మెరైన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి


విలేకరులతో మాట్లాడుతున్న అప్పలరాజు, నాయకులు

ఎస్.రాయవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుడివాడలోని సాయి మెరైన్ రొయ్యల పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. అడ్డరోడ్డులో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికురాలు అనిత అనారోగ్యానికి గురైతే మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాల్సిన యాజమాన్యం సకాలంలో స్పందించలేదన్నారు. దీంతో కార్మికులు మృతి చెందిందని ఆరోపించారు. అనితను పరిశ్రమ యాజమాన్యమే హత్య చేసినట్టుగా భావించి, వెంటనే హత్యానేరం కింద పోలీసులు కేసు నమోదుచేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాజేశ్, నాయకులు చిరంజీవి, బాబ్జీ పాల్గొన్నారు.

యోగాంధ్రపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

నక్కపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర-2025 కార్యక్రమంపై ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో డి.సీతారామరాజు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగో రోజు మండల స్థాయి ప్రోటోకాల్ యోగాసనాలపై శిక్షణా కార్యక్రమం శుక్రవారం ఉపమాక ఆలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్న విషయాన్ని గుర్తించి శిక్షణను వినియోగించుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతత, చక్కని ఆరోగ్యానికి యోగా ఉపకరిస్తుందని చెప్పారు. వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి వైద్యాధికారి కె.రఘు పర్యవేక్షణలో సుమారు 198 మంది ఉద్యోగులకు యోగా గురువులు డి.రాంబాబు, డీఎస్‌వీ సాయి, యోగా మాస్టర్ ట్రైనీలు ఎస్‌వీఎస్ ఆచార్యులు, ఆదిత్య రుత్విక్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో శ్రీవిద్య, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్లెల్లో యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలి

కోటవురట్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో యోగా శిక్షణ తరగతులను తప్పనిసరిగా నిర్వహించాలని తహసీల్దార్ తిరుమలబాబు చెప్పారు. శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో వివిధ శాఖల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ రఘురామ్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో 50 మందికి యోగాపై అవగాహన కల్పించడంలో సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని చెప్పారు. మానసికం, శారీరక ఇబ్బందులు అధిగమించడానికి యోగా మంచి మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఎంఈవోలు రామారావు, జోషిలు, వైద్య, ఆరోగ్య, వెలుగు, వ్యవసాయ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుడివాడలో యోగా శిక్షణ

ఎస్.రాయవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ సచివాలయం వద్ద శుక్రవారం స్థానిక ప్రజలకు యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగా గురువు పలు ఆసనాలు చేసి చూపించారు. అలాగే యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరంలో ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికులకు బకాయిలు చెల్లించాలి'



సూపరింటెండెంట్ కృష్ణారావును కలిసిన యూనియన్ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బంది, సెక్యూరిటీ గార్డులకు బకాయి పడిన మూడు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణారావును శుక్రవారం కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వచ్చే నెల నుంచి శానిటేషన్, సెక్యూరిటీ విభాగాలకు నూతన కాంట్రాక్టర్లు రానున్న నేపథ్యంలో సదరు సిబ్బందికి జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు జరిగే విధంగా చూడాలని కోరారు. అనంతరం సూపరింటెండెంట్ మాట్లాడుతూ కార్మికులకు బకాయి వేతనాల విడుదలయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డాది ఈశ్వరరావు, వెంకటలక్ష్మి, బి.ఎల్.రాజు, ప్రసాద్, నవీన్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై పశుదాణా



చెరకాంలో పశుదాణాను రైతులకు అందజేస్తున్న కూటమి నాయకుడు

కశింకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీడ, చెరకాం గ్రామ రైతు సేవా కేంద్రాల్లో పాడి రైతులకు రాయితీపై పశుదాణాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సీహెచ్ ఈశ్వరరావు, పైలా వెంకటేష్, బండారు అప్పారావు తదితరులు రైతులకు యాభై కేజీల పశుదాణా బస్తాను యాభైశాతం రాయితీపై అందజేశారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా ఆసరాగా నిలుస్తోందన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలకు రైతులు ధన్యవాదాలు తెలిపారు. కన్నూరుపాలెం పశువైద్యాధికారిణి దయానీ, సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మిక సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం'



ఫార్మా సిటీలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నినాదాలు

పరవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఫార్మా సిటీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలిత యూనియన్ జెండాను జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణకు సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికులందరినీ ఐక్యం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.రమణ, సత్తిబాబు, జి.చిట్టిబాబు, కె.అప్పలరాజు, శేషు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో వాహనదారులకు అవస్థలు



సినిమాహాల్ రోడ్డుపై పడిన గుంతల్లో చేరిన వర్షపునీరు

సబ్బవరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో సినిమా హాల్ రోడ్డు అధ్వానంగా మారింది. ఎస్‌టీబీఎల్ థియేటర్ మీదుగా ఆర్‌సీఎం చర్చి, గెడ్డం వారి కల్లాలకు వెళ్లే వరకు ఇదే దుస్థితి నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై పడిన గుంతల్లో నీరు ఎక్కడికక్కడ చేరి నిలిచిపోతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీర్ఘకాలంగా ఈ సమస్య ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైె ఈ రహదారిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పూజారిగా చేరి.. ఆలయంలో చోరీ

- వన్ టౌన్ వుడ్‌యార్డు స్ట్రీట్‌లో దుర్గాలమ్మ ఆభరణాలు తస్కరణ
- నిర్వహకుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- సుమారు పది ఆలయాల్లో దొంగతనానికి పాల్పడినట్టు అంగీకారం
- చోరీ సొత్తు స్వాధీనం ▸▸ నిందితుడు అనకాపల్లి ప్రాంతీయుడు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని విశాఖపట్నం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఏడీసీపీ మోహనరావు తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఆకోజు బ్రహ్మాజీ (51)కి భార్య, కుమారుడు ఉన్నారు. భార్యతో కలహాల కారణంగా విడిపోయి విశాఖలోని అల్లిపురం వద్ద ఒంటరిగా ఉంటున్నాడు. వన్‌టౌన్‌లో వుడ్‌యార్డు స్ట్రీట్‌లో దుర్గాలమ్మ ఆలయంలో పూజారి కావాలని నిర్వాహకులు పెట్టిన బోర్డు చూసిన బ్రహ్మాజీ ఈనెల 19న అక్కడకు వెళ్లి అభ్యర్థించాడు. దీంతో అతడిని నియమించి, గుడి తలుపుల తాళాలు అప్పగించారు. ఆలయంలోపలకు వెళ్లి పూజకు పూలు, పండ్లు తెమ్మని బ్రహ్మాజీ కోరాడు. వాటిని తీసుకొచ్చేలోపు అమ్మవారి వెండి కిరీటం, వెండి వస్తువులను తస్కరించి వెళ్లిపోయాడు. దీనితో నిర్వాహకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ పుటేజ్‌ల ఆధారంగా గురువారం కురుపాం మార్కెట్ వద్ద అతనిని పట్టుకున్నారు. అతని వద్ద ఆలయాల్లో వినియోగించే వివిధ రకాల వెండి వస్తువులు లభ్యమయ్యాయి. వాటి విషయమై పోలీసులు ఆరా తీయగా, జిల్లాలోని సుమారు పది ఆలయాల్లో దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ క్రమంలో అతని వద్ద నుంచి 2,900 గ్రాముల వెండి, 7.6 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. అతనికి వయస్సు పైబడటంతో రోజు వారి అవసరాలు తీర్చుకునేందుకు చిన్నచిన్న గుడులను ఎంచుకొని చోరీలకు పాల్పడేవాడు. ఆలయాల్లో పూజారుల పేర్లు ముందుగా తెలుసుకొని వారితో పరిచయం పెంచుకుని గుడిలో ఎవరూలేని సమయంలో దేవుని ఆభరణాలు అపహరించి అమ్మేసి, వచ్చిన ఆ డబ్బుతో కాలక్షేపం చేసేవాడని ఏడీసీపీ వివరించారు.

వంతెనకు చిల్లు.. దాటాలంటే గుండె ఝల్లు

- మిరియాల కాలనీకి వెళ్లే మార్గంలో సాగునీటి కాలువపై ఇనుప రేకుతో ఏర్పాటు ▸▸ నిర్వహణను పట్టించుకోని అధికారులు
- ప్రస్తుతం తుప్పు పట్టడంతో వాహనాలు వెళ్లే సమయాల్లో శబ్దాలు ▸▸ వెంటనే మరమ్మతులు చేపట్టాలని పలువురు వేడుకోలు

అనకాపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీదేవిపేట రోడ్డు నుంచి మిరియాల కాలనీకి వెళ్లే మార్గంలో యల్లయ్య సాగునీటి కాలువపై ఉన్న వంతెన దెబ్బతింది. దీనిని ఇనుప రేకుతో ఏర్పాటు చేయడంతో జంగుపట్టి చిల్లులు పడుతోంది. ఈ వంతెనకు అతి సమీపంలో లక్ష్మీదేవిపేట రైల్వేగేటు ఉంది. రైళ్ల రాకపోకల కోసం సిబ్బంది గేటు వేసే సమయంలో చాలా సేపు అక్కడ నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడేది. ఇది గుర్తించిన జీవీఎంసీ అధికారులు ఇనుప వంతెనను పదిహేనేళ్ల క్రితం నిర్మించారు. దీంతో గేటు పడే సమయాల్లో వాహనచోదకులు ఈ ఇనుప వంతెన మీదుగా మిరియాల కాలనీ ఒకటవ వీధి లోబడి విజయరామరాజుపేట జంక్షన్‌కు వచ్చి యథావిధిగా రాకపోకలు సాగిస్తుంటారు. లక్ష్మీదేవిపేట వైపు వెళ్లేవారు కూడా నాయుళ్లవీధి మీదుగా మిరి యాల కాలనీ ఒకటో వీధిలోంచి ఈ వంతెన మీదుగా వెళ్తుంటారు. ఈ వంతెన నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో రోజు రోజుకి దెబ్బతింటుంది. ఒక వాహనం వంతెన మీదుగా వెళితే భారీ శబ్దాలు వస్తుండడంతో వాహనచోదకులు ఉలిక్కిపడుతున్నారు. అంతేకాకుండా వంతెనగా వేసిన రేకు తుప్పుపట్టి రంధ్రాలు పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అంతా భయాందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణమే ఈ వంతెనకు మరమ్మతులు చేయించి, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.



లక్ష్మీదేవిపేట సమీపంలో యల్లయ్య కాలువపై దెబ్బతింటున్న ఇనుప వంతెన

రాయి క్వారీలో అక్రమ తవ్వకాలు!

- రాయిని తరలించి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు ▸▸ పట్టించుకోని అధికారులు ▸▸ మరింత రెచ్చిపోతున్న అక్రమార్కులు



అనుమతులు లేకుండా క్వారీ నుంచి రాయిని ట్రాక్టర్‌లో లోడింగ్

కశింకోట, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం శివారు సింగవరం గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 61లో అక్రమ క్వారీ వ్యాపారం నిర్భయంగా సాగుతోంది. ఐదు ట్రాక్టర్లతో గురువారం రాయిని తరలించుకుపోయి జి.భీమవరం గ్రామంలో పునాదులను కప్పే కార్యక్రమాన్ని అక్రమార్కులు చేపట్టారు. ఇక్కడ ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్, మైనింగ్, పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలతో క్వారీని పేల్చి ప్రకృతి సహజ వనరులను ధ్వంసం చేస్తున్నారు. చాన్నాళ్లుగా ఇక్కడ పెద్ద ఎత్తున ఈ తంతు సాగుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా క్వారీ రాయి తరలింపును అరికట్టాలని పలువురు కోరుతున్నారు. ఇదిలావుంటే, క్వారీలను పేలుడు పదార్థాలతో పేల్చుతున్నారు. క్వారీలో బ్లాస్టింగ్ చేయాలంటే సంబంధిత లైసెన్సు కలిగినవారు మాత్రమే చేపట్టాలి. కానీ ఇక్కడ అలా కాకుండా అవగాహన లేని రోజువారీ కూలీలు నేరుగా పేలుడు పదార్థాలను పెట్టి కొండలను పేలుస్తున్నారు. ఈ సమయంలో జరగరానిది జరిగి కార్మికులు ప్రమాదానికి గురైతే బాధ్యులు ఎవరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి వాటికి పేలుడు పదార్థాలు సరఫరా చేసిన వారిపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ అంశాన్ని తహసీల్దార్ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా, ఈ క్వారీకి ఎటువంటి అనుమతులు లేవన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. క్వారీ రాయి తరలింపుపై ఫిర్యాదు తమకు అందిన వెంటనే తాళ్లపాలెం, సింగవరం వీఆర్‌వోలను సంఘటనా స్థలాలను పంపించామన్నారు. అయితే సదరు స్థలానికి వెళ్లేసరికి ఎటువంటి వాహనాలు లేవని, క్వారీ రాయిని తరలించే ట్రాక్టర్లను గుర్తించి చర్యలు తీసుకుంటాం అని చెప్పారు.



ట్రాక్టర్ ద్వారా రాయిని తరలిస్తున్న దృశ్యం

మామిడి, జీడి మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- అవగాహన సదస్సులో జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకర్

కశింకోట, మే 30 (ఆంధ్రజ్యోతి) : మామిడి, జీడి మామిడి సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బయ్యవరం, కశింకోటలలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖాధికారి జి.ప్రభాకర్ మాట్లాడుతూ కాపు కోసిన తరువాత మామిడి, జీడిమామిడిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. డీఆర్‌సీ సహాయ వ్యవసాయ సంచాలకులు సి.హెచ్.సుబ్రహ్మణ్యం వరి సాగులో నారుమడి యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. మండల వ్యవసాయాధికారిణి స్వప్న మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన విస్తరణాధికారి ప్రవీణ, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు, పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజాజ్ఞి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకర్

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్యౌషధం

- ఆసనాల శిక్షణ శిబిరంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతిప్రభ



యోగాసనాలు వేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్యౌషధమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎం.శాంతిప్రభ అన్నారు. యోగాంధ్రలో భాగంగా శుక్రవారం ఇక్కడి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో యోగాసనాలపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను శిక్షకులు వివరించారు. అంతకు ముందు ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి వైద్యులు, సిబ్బంది ర్యాలీగా ఇండోర్ స్టేడియానికి చేరుకొని దారిపొడవునా యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారిణి డాక్టర్ కె.లావణ్య, జిల్లా లెప్రసీ యూనిట్ అధికారి బాలాజీ, నర్సీపట్నం ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వీరజ్యోతి, జాతీయ ఆరోగ్యమిషన్ జిల్లా అధికారిణి డాక్టర్ ప్రశాంతి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఆర్ఎంవో గౌతమ్, జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇదిలావుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణ పిలుపునిచ్చారు. గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జీవీఎంసీ అధికారులు, సిబ్బంది యోగాపై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా జడ్సీ రమణ మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యం బాగుంటుందన్నారు. నిత్యం పని ఒత్తిడితో ఇబ్బంది పడే వారు కొద్దిసేపు యోగా చేస్తే ఒత్తిడి తొలగిపోవడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని వివరించారు. ఆయుష్ విభాగం వైద్యాధికారిణి డాక్టర్ లావణ్య, యోగా గురువులు నగేశ్, అప్పారావు పర్యవేక్షణలో జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు యోగాసనాలు వేయడంలో శిక్షణ పొందారు. అలాగే గౌరీ గ్రంథాలయంలో ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది యోగాసనాలలో శిక్షణ పొందారు. అనకాపల్లి యోగా లైఫ్ టీచర్ కరణం రమాదేవి, ఈశ్వరరావుల శిక్షణలో అధికారులు, సిబ్బంది యోగా కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల ఆసనాలు, వాటి ఉపయోగాలు శిక్షకులు వివరించారు. ప్రతి రోజూ గంటపాటు యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గౌరీ గ్రంథాలయంలో విద్యుత్ శాఖ సిబ్బంది..



ఎస్ఆర్ శంకరన్ భవనంలో జీవీఎంసీ సిబ్బంది..

జీవీఎంసీలో తృప్తి క్యాంటీన్లు

- స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోభివృద్ధికి జీవీఎంసీ నిర్ణయం
- జూన్ 6న జరగనున్న కౌన్సిల్ సమావేశానికి 27 అంశాలతో అజెండా
- మరికొన్ని అంశాలను చేర్చాలని కార్పొరేటర్ల పట్టు

విశాఖపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో 'తృప్తి' క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. జీవీఎంసీ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోభివృద్ధి, మహిళలకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో జీవీఎంసీ యూసీడీ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కింద సారా ప్రాజెక్టు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం గుర్తించిన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతానికి మూడుచోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించడంతో పైలట్ ప్రాజెక్టుగా వీటిని ప్రారంభించే అవకాశం ఉంది. దీనిపై జూన్ 6న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపేందుకు వీలుగా అజెండాలో చేర్చారు. కౌన్సిల్ సమావేశానికి అధికారులు 27 అంశాలతో కూడిన అజెండాను సిద్ధం చేశారు. అయితే ఇందులో మరికొన్ని అంశాలను చేర్చాలంటూ పలువురు కార్పొరేటర్లు మేయర్ పీలా శ్రీనివాసరావు, గ్రేటర్ కార్యదర్శి బీవీ రమణను కలిసి పట్టుబడుతున్నారు.

జీవీఎంసీ కౌన్సిల్ సాధారణ సమావేశం గత ఏడాది డిసెంబరులో జరిగింది. ఆ తరువాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, మేయర్, డిప్యూటీ మేయర్లపై అవిశ్వాస తీర్మానం, కొత్త మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నిక కారణంగా ఇప్పటివరకు కౌన్సిల్ సమావేశం జరగలేదు. మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికైన తరువాత ఇదే తొలి కౌన్సిల్ సమావేశం కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. జూన్ 6న జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునేందుకు వీలుగా అధికారులు, కార్పొరేటర్లు అనేక పనులకు సంబంధించిన అంశాలను అజెండాలో చేర్చాలంటూ మేయర్ పీలా, ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్‌కు వినతి పత్రాలను అందజేశారు. దీంతో అజెండాలో వందకుపైగా అంశాలు ఉండవచ్చని అందరూ భావించారు. కానీ అజెండా కూర్పుపై మేయర్, జీవీఎంసీ కార్యదర్శి, కొందరు అధికారులు కార్పొరేటర్లతో చర్చించారు. అనంతరం 27 అంశాలను మాత్రమే అజెండాలో చేర్చాలని నిర్ణయించారు.

ఇందులో ప్రధానంగా మలేరియా సీజనల్ కార్మికుల నియామకం, పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికుల సేవల పొడిగింపు, 76వ వార్డులో రూ.1.96 కోట్లతో డ్రెయిన్ నిర్మాణం, 97వ వార్డులో రూ.1.85 కోట్లతో థీమ్ పార్కుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, 87వ వార్డు పరిధి కూర్మన్నపాలెం ఎంవీపీ-ఎంకే అపార్టుమెంట్‌కు 150 కేఎల్‌డీ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడానికి రూ.1.21 కోట్లతో పైపులైన్ నిర్మాణం, 18వ వార్డు పరిధి అప్పూఘర్‌లో రూ.66.50 లక్షలతో కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం వంటి అంశాలు ఉన్నాయి.

కాగా జనసేన పార్టీకి చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తాను కౌన్సిల్‌లో చర్చించేందుకు వీలుగా పది అంశాలను అజెండాలో చేర్చాలని కోరితే, వాటిని చేర్చకపోవడంతో తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాల టెండర్లు, రాత్రి ఫుడ్ కోర్టు, టీడీఆర్ కుంభకోణం, పార్కులు, జీవీఎంసీ ఆస్తులు, జీ-20 పనులు వంటి అంశాలపై చర్చించాలని కోరుతూ మేయర్, గ్రేటర్ కార్యదర్శితోపాటు ఇన్‌చార్జి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తే, కనీసం వాటిని పట్టించుకోక పోవడానికి కారణమేమిటని కార్యదర్శిని ఆయన నిలదీశారు. తాను ఇచ్చిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకపోతే అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలపాలని డిమాండ్ చేయడంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. అలాగే 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 87వ వార్డు బొండా జగన్ కూడా తమ వార్డులకు సంబంధించిన పలు అంశాలను అజెండాలో చేర్చాలని పట్టుబడుతున్నారు. దీంతో శుక్రవారమే అజెండా కాపీలను కార్పొరేటర్లకు పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ సాయంత్రానికి కూడా వారికి చేరకపోవడంతో చర్చకు దారితీసినట్టయింది. ఆయా అంశాలను అనుబంధ అజెండాలో చేర్చుతారా? లేకపోతే 27 అంశాలతోనే అజెండాను ఖరారు చేస్తారా? అనేదానిపై అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- పరవాడ ప్రధాన రహదారిలో పాడైన విద్యుత్ స్తంభం అడుగు భాగం
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన



తుప్పు పట్టిన స్తంభం అడుగు భాగం

పరవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారిలోని గ్రామీణ వికాస్ బ్యాంకు వద్ద ఉన్న విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. తుప్పు పట్టి అడుగు భాగంలో రంధ్రాలు ఏర్పడ్డాయి. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. స్తంభం అడుగుభాగం చుట్టూ సపోర్టుగా సిమెంట్ దిమ్మను నిర్మించకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని అంటున్నారు. పెద్ద ఎత్తున గాలి వీస్తే స్తంభం కదులుతోందని చెపుతున్నారు. ప్రధాన రహదారికి ఆనుకొని ఈ స్తంభం ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముందుకు వస్తుందోనని పలువురు హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

నేడు ఎక్సైజ్ శాఖ సీజ్ చేసిన వాహనాలకు వేలం

కొత్తూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ అనకాపల్లి పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను శనివారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నామని సీఐ లక్ష్మన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ ఆధార్ కార్డు జిరాక్సు రూ.వెయ్యి ధరావత్తు చెల్లించి అనకాపల్లి మండలం కొప్పాక వద్ద ఉన్న ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో వేయనున్న వేలం పాటలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

సబ్బవరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : అంతకాపల్లి గ్రామానికి చెందిన వెన్నల నాయుడు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఇతని ఆర్థిక పరిస్థితిని గుర్తించిన స్థానిక నాయకులు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి రూ.30,786 మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ మేరకు సదరు చెక్కును జనసేన మండల కన్వీనర్ కర్రి కనకరాజు, ఎం.మహాలక్ష్మీనాయుడు శుక్రవారం ఇక్కడ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్ల రమణ, మామిడి కొండాజీ, బంతికోళ్ల పద్మ, సబ్బవరపు రమణ, నాయుడు, గొర్లి నూకరాజు, కర్రి నర్సింగరావు, శేఖర్, జెట్టి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు ఏపీ జెన్‌కో క్యాంప్ ఏడీఈగా జైపాల్


బాధ్యతలను స్వీకరిస్తున్న జైపాల్

సీలేరు, మే 30 , (ఆంధ్ర జ్యోతి): సీలేరు జెన్‌కో క్యాంప్‌ఏడీఈగా జైపాల్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ క్యాంప్ ఏడీగా విధులను నిర్వహించిన దుర్గాశ్రీనివాస్‌కు జెన్ కో విద్యుత్‌సౌధా విజయవాడకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈయన స్థానంలో విజయవాడ విద్యుత్ సౌధాలో ఏఈగా కొనసాగుతున్న జైపాల్‌కు ఏడీఈగా పదోన్నతి కల్పిస్తూ సీలేరు జెన్‌కో సివిల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఈమేరకు ఆయన శుక్రవారం సీలేరు క్యాంప్ ఏడీఈగా దుర్గాశ్రీనివాస్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. జైపాల్‌కు స్థానిక క్యాంప్ కార్యాలయం ఇంజనీర్లు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

మోదకొండమ్మ ఆలయంలో అన్న ప్రసాదం పంపిణీ పునః ప్రారంభం

పాడేరురూరల్, మే 30: పాడేరు మోదకొండమ్మ ఆలయంలో శుక్రవారం నుంచి మధ్యాహ్న సమయంలో భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందించే అన్నప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని పునరుద్ధరించినట్టు ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లో కోటిబాబునాయుడు తెలిపారు. మోదకొండమ్మ ఉత్సవాల నేపథ్యంలో ఇటీవల కొన్ని రోజులుగా నిలిపి వేశారు. తిరిగి యధావిధిగా వారానికి మూడు రోజులు శుక్ర, ఆది, మంగళవారాల్లో భక్తులకు ప్రసాదం పంపిణీ నిర్వహిస్తామన్నారు. శుక్రవారం 150 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బోనంగి వెంకటరమణ, చల్లా రామకృష్ణ, లకే రత్నాబాయ్, కిల్లు చంద్రమోహన్, కొణతాల సతీశ్, పలాసి రమణమ్మ, గూడెపు సూర్యప్రకాశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎబిలిటీ పునరావాస కేంద్రం ప్రారంభం


ఎబిలిటీ పునరావస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, మే 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఎబిలిటీ రీహేబిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ శుక్రవారం ప్రారం భించారు. ఈ సెంటర్‌లో ఫిజియో థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ప్రొస్థెటిక్స్ థెరపీ తదితర సేవలు రోగులకు అందుబాటులోకి రానున్నట్టు ఈసందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ టి.నరసింగరావు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ స్వామినాయుడు, ఎబిలిటీ రీహేబిటేషన్ సెంటర్ సీఈవో వంశీ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో ముసురు

పాడేరు, మే 30(ఆంధ్రజ్యోతి): మన్యంలో శుక్రవారం ముసురు వాతావరణం నెలకొంది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని ఏజెన్సీలోని దాదాపుగా అన్ని మండలాల్లోనూ ఆకాశం మేఘవృతమై, అక్కడక్కడ జల్లులు పడ్డాయి. ఏజెన్సీలో శుక్రవారం ఉదయం నుంచి ఎండ ప్రభావం లేదు. ఆకాశం మేఘావృతమై కొన్ని ప్రాంతాల్లో మాత్రం జల్లులు పడ్డాయి.

కొయ్యూరులో 31 డిగ్రీల ఉష్ణోగ్రత

మన్యంలో శుక్రవారం ముసురు వాతావరణం నెలకొన్నప్పటికీ గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మాత్రం పెద్దగా మార్పు లేదు. దీంతో కొయ్యూరులో 31 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా జీకేవీధిలో 29.2, పాడేరులో 29.0, చింతపల్లిలో 28.5, అరకులోయలో 27.9, హుకుంపేటలో 28.4, జి.మాడుగులలో 26.1, డుంబ్రిగుడలో 26.0, అనంతగిరిలో 25.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రజా సమస్యలపై సీఐటీయూ పోరాటం


మాట్లాడుతున్న నేత ఉమామహేశ్వరరావు

అరకులోయ, మే 30 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ కార్మికుల సమస్యలపై పోరాటం చేసి వారి కష్టాలు తీర్చుతుందని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం పద్మాపురం గార్డెన్ ఎదుట కార్మికులతో కలిసి నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సీఐటీయూ 1970లో ఆవిర్భవించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44లేబర్ చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్స్ అమల్లోకి తెచ్చిందన్నారు. ఇవి కార్మికులకు ఉరితాడుగా మారాయని వాపోయారు. వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన చేపట్టనున్న సమ్మె కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాడిరాజు, ఆటో కార్మిక సంఘం నాయకులు రమేస్, పద్మాపురం గార్డెన్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీరామ్, జగ్గారావు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల పరిధి గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. చినబాబు పాత్రుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్లు మరమ్మతులు చేపట్టనున్నందున ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


గిరిజనులు సాగు చేస్తున్న పిప్పళ్ల పంట


వి క్రయానికి సిద్ధం చేస్తున్న పిప్పళ్లు

ఆశాజనకంగా పిప్పళ్ల సాగు

- ఏజెన్సీ వాతావరణం అనుకూలం
- విస్తారంగా సాగు... కష్టానికి తగిన ఫలితం

జి.మాడుగుల, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో పసుపు తర్వాత పిప్పళ్ల పంటకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి బౌగోళిక వాతావరణం పిప్పళ్ల సాగుకు అనుకూలం. పసుపు మాదిరి రెండేళ్లకొసారి పంట చేతికి వస్తుంది. ప్రస్తుతం ఏజెన్సీలో పిప్పళ్ల సాగు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. మన్యంలో ఇటీవల వర్షపాతం అధికంగా నమోదు కావడంతో పిప్పళ్ల మొలకలు ప్రస్తుతం ఏపుగా ఎదిగాయి. వీటికి దుగ్గి పనులు చేపడుతున్నారు. కొన్నిచోట్ల పంట చేతికి వస్తోంది. సాధారణంగా ఏజెన్సీలో పసుపు, పిప్పళ్లు ఒకే ప్రాంగణంలో సాగు చేపడతారు. అయితే, ఈ సాగులో పసుపు (దొడ్డి)లో 70 శాతం పసుపు ఉంటే మిగిన 30 శాతం వ్యత్యాసంలో పిప్పళ్లు ఉంటాయి. పసుపుకు బ్రీడ్ పసుపు కొమ్ములు నాటుతారు. అదే పిప్పళ్లకు ప్రత్యేకమైన బ్రీడ్ విత్తనాలు ఉండవు. ఏడాదిలో జూలై మొదటి వారంలో మాత్రమే పిప్పళ్ల సాగు నుంచి సేకరించిన కొన భాగం భూమిలో నాటుతారు. మిగిలిన కాలం అనుకూలం కాదు. ఈ పిప్పళ్లను ఆయుర్వేదంలో వినియోగిస్తారు. వివిధ వ్యాధుల నివారణకు దోహపడుతుంది.

పసుపుకంటే పిప్పళ్ల ధర అధికం

పసుకు కనీస మద్దతు ధర కిలో రూ. 100 కనిష్ఠం ఉంటే.. పిప్పళ్ల మోడు కిలో రూ.300 నుంచి నిఖార్సయిన మోడును కిలో రూ.400 నుంచి 500 వరకు ధర వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం పసుపు ధర కిలో రూ. 135 ఉండగా.. పిప్పళ్ల మోడుకు కిలో రూ.320 వరకు ధర పలుకుతోంది.

ప్రభుత్వం చేయూత అందించాలి



ప్రభుత్వం రైతులకు చేయూత అందిస్తే మరిన్ని ఫలితాలు సాధించడానికి వీలవుతోంది.ఆధునిక పద్ధతులతో రైతాంగానికి తోడ్పాటునందిస్తే పసుపుకు పిప్పళ్ల వేర్వేరు సాగు విస్తీర్ణం చేపట్టి పిప్పళ్ల దిగుబడి పెంచవచ్చు.

- గేదెల అర్జున్ రైతు, వి.కోడాపల్లి గ్రామం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


సిబ్బందికి యోగా శిక్షణనిస్తున్న హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ

సీలేరు, మే 30 , (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని స్థానిక పీహెచ్ సీ వైద్యాధికారి ఎస్‌కే మస్తాన్‌వల్లీ తెలిపారు. ఆస్పత్రిలో శుక్రవారం వైద్య సిబ్బందికి యోగాంధ్ర- 2025 కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు.వైద్యాధికారి మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక ఒత్తిడి తగ్గి అన్ని అవయవాలు సక్రమంగా పనిచేసేలా రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుందన్నారు. ప్రతీ రోజు ఒక గంటపాటు యోగా చేయాలన్నారు. వైద్యాధికారి కె సౌమ్య, హోమియో వైద్యాధికారి సుజనారాయ్, స్థానిక హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై సర్వే


అక్రమ కట్టడాలను సర్వే చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

చింతపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించారు. శుక్రవారం హనుమాన్ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రహదారికి ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాల్లో దుకాణాలు, గృహనిర్మాణాలు చేపట్టిన యజమానులకు నోటీసులు అందజేశారు. ఈ స్థలాన్ని సర్వేయర్లు, వీఆర్వోలు కొలతలువేసి మార్కు చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కలెక్టర్ ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలనిఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు చింతపల్లిలో 65మంది ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వీటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేదంటే తామే తొలగించాల్సి ఉంటుందంటూ నోటీసులు అందజేశారు. ప్రధాన రహదారికి ఇరువైపులా 24 అడుగుల వరకు నిర్మించుకున్న కట్టడాలన్నీ తొలగిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

టీడీపీని విమర్శించే నైతిక హక్కు వైసీపీకి లేదు

- కూటమి ప్రభుత్వంలోనే ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి
- టీడీపీ డివిజన్ నాయకుడు పాండురంగస్వామి


మాట్లాడుతున్న టీడీపీ డివిజన్ నాయకుడు పాండురంగస్వామి

పాడేరురూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదని టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి అన్నారు. శుక్రవారం ఆయన పాడేరులోని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంతోనే ఆదివాసీ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. వైసీపీ పాలనలో కనీసం జరగలేదన్న విషయం ఆ నాయకులు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కడప మహానాడులో మంత్రులు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నీ అవాస్తవాలే మాట్లాడారంటూ మాజీ ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. టీడీపీ హయాంలో జీవో 275, 3లను తీసుకువచ్చి వేలాది మంది ఆదివాసీలకు ఉద్యోగావకాశాలు కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వైసీపీ నాయకులు ఇప్పటికైనా తీరు మార్చుకొని టీడీపీ నాయకులు, ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలను మానుకోవాలని హితవు పలికారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజన విద్యార్థులకు ఉపయోగపడే కార్పొరేట్ విద్యనందించే బెస్టు అవైలబుల్ స్కూల్స్, అంబేడ్కర్ విదేశీ విద్య పథకాన్ని రద్దు చేసిందన్నారు. గిరిజనులకు ప్రధానమైన జీవో 3ను రద్దు చేస్తే కనీసం రివ్యూ పిటిషన్ కూడా వేయని దుస్థితి వైసీపీ దని ఆయన ధ్వజమెత్తారు. అమ్మఒడిలో కోత విధించిన ఘనత వైసీపీదేనని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న గిరిజన ప్రాంతంలో లక్ష ఎకరాల్లో కాఫీ తోటల అభివృద్ధి తదితర అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైసీపీ హయాంలో గిరిజనులకు ఇళ్లు మంజూరు కాలేదు. సాగునీటి కోసం చెక్‌డ్యామ్ మరమ్మతు, రహదారులపై గోతులను పూడ్చారా అని ఆయన ప్రశించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేసి దోపిడీ చేయడమే వైసీపీ ప్రభుత్వం ప్రధానంగా సాగిందని విమర్శించారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు తీరుమార్చుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంపై, టీడీపీ నాయకులపై విమర్శలు చేస్తే ప్రజలే తగిన గునపాఠం చెపుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంబాబు, సూర్యకాంతం, వెంకటరావునాయుడు, నూకరాజు, సాగర్, మురళి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. జూన్ నాలుగోవ తేదీ వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవలం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 0.1 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. గాలిలో తేమ 53-82శాతం ఉంటుందన్నారు.

ఖరీఫ్ విత్తనాలు సిద్ధం

గూడెంకొత్తవీధి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజన రైతులకు ఖరీఫ్ సాగుకి ముం దుగానే వరి విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టు వ్యవసాయ అధికారి మధుసూదనరావు అన్నారు. మండలానికి 1,119 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని ప్రభుత్వం నివేదిక పంపించగా, తొలివిడతగా 300క్వింటాళ్ల వరి విత్తనాలు వచ్చాయన్నారు. మిగిలిన విత్తనాలు రెండు రోజుల్లో రైతు సేవా కేంద్రాలకు చేరనున్నట్టు చెప్పారు. అలాగే, అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన 15,558మంది రైతులను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి చేశామన్నారు.

అనంతగిరి రేంజర్‌గా సుధీర్‌కుమార్


సుధీర్‌కుమార్

అనంతగిరి, మే 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని అటవీ శాఖ రేంజర్‌గా జె.సుధీర్‌కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఇక్కడ రేంజర్‌గా పనిచేసిన దుర్గాప్రసాద్ జనవరిలో పదవీ విమరణ చేయగా.. మండలంలోని జీనబాడు రేంజ్‌కు రేంజర్‌గా పనిచేస్తున్న రాజాబాబుకు ఇన్‌చార్జి బాధ్యతలన ఉన్నతాధికారులు అప్పగించారు. అయితే, 2012-14లో ఇక్కడే ఫారెస్ట్ సెక్షన్ అధికారిగా సుధీర్‌కుమార్ పనిచేశారు.తరువాత డీఆర్వోగా పదోన్నతిపై బొబ్బిలి వెళ్లారు. అక్కడ నుంచి రేంజర్‌గా పదోన్నతిపై తిరిగి ఇక్కడకు వచ్చారు.

గిరిపుత్రుల కష్టాలు తీరే ‘దారి’ లేదా?

- అరకులోయ మండలంలో అరకొరగా గ్రామీణ రహదారుల నిర్మాణం
- రాకపోకలకు అవస్థలు


నిలిచిపోయిన మొర్రిగుడ- అంటిపర్తి రహదారి పనులు

అరకులోయ, మే 30 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలో పలు రహదారులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో గిరిజనులు రాకపోకలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పదేళ్ల ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ హయాంలో లోతేరు పంచాయతీ మొర్రిగుడ రోడ్డు నుంచి అంటిపర్తివరకు రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. అలాగే, బొండాం పంచాయతీ జయంతివలస- బొండాంకొత్తవలస వరకు, మజ్జివలస నుంచి బొండాం వరకు బీటీ రహదారుల నిర్మాణానికి ఉత్తర్వులు మంజూరు చేశారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు కావడం లేదంటూ సంబంధిత కాంట్రాక్టర్లు ఈ పనుల జోలికే పోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిచిపోయిన ఈ మూడు రహదారి పనులు కాంట్రాక్టర్లు ప్రారంభించారు. జయంతివలస- బొండాం కొత్తవలస రహదారిలో సగం మేర తారు రోడ్డు, అవసరమైన చోట కల్వర్టులు,సీసీ ర్యాంప్‌లు నిర్మించారు. మరో సగం పెద్దగెడ్డవంతెన నుంచి బొండాంకొత్తవలస వరకు తారురోడ్డు పనులు చేపట్టకుండా నిలిపివేశారు. అలాగే, లోతేరు పంచాయతీ మొర్రిగుడ నుంచి అంటిపర్తివరకు ఉన్న రహదారిలో కల్వర్టులు నిర్మించారు. కల్వర్టు శ్లాబ్ నిర్మించారు. జీఎస్‌పీ వేసి తారురోడ్డు పనులు చేపట్టకుండా విడిచిపెట్టారు. అదే విధంగా బొండాం పంచాయతీ పరిధి మజ్జివలస నుంచి బొండాం వరకు ఉన్న రహదారిలో కల్వర్టులు, సీసీ ర్యాంపులు వేసి బీటీ రోడ్డు పూర్తి చేయలేదు. దీంతో కంకరు లేచిపోతోంది. జోరుగా జరిగిన పనులన్నీ గత మార్చి నెలాఖరుతో అర్థాంతరంగా పనులు నిలిపి వేశారు. ప్రభుత్వం బిల్లులు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలొకంది. దీంతో గత వైసీపీ పాలన మాదిరిగానే కూటమి ప్రభుత్వంలోనూ నిధులు రాక మధ్యలో విడిచిపెట్టాల్సి వస్తోందని కాంటాక్రక్టర్లు వాపోతున్నారు. ఇకనైనా పెండింగ్ బిల్లులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. పనులు పూర్తి చేసి తమ కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

జాబ్‌మేళాలో 54 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, మే 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 54 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 183 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారిలో 54 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు. మరో 34 మందిని తదుపరి ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అభినందించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలి: ఎస్ఐ


గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

సీలేరు, మే 30 , (ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, గంజాయి సాగు, రవాణా తదితర కార్యకలాపాలకు గిరిజన యువత దూరంగా ఉండాలని సీలేరు ఎస్ఐ రవీంద్ర అన్నారు. గాలికొండ పంచాయతీలోని పాత్రునిగుంట, సప్తగూడ, బుగ్గిరేవుల, మైనకోట, గుర్రాగొంది గ్రామాలను శుక్రవారం సందర్శించారు. గ్రామాల్లో సమస్యలపై గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులతో మాట్లాడుతూ చదువుకున్న గిరిజన యువత ప్రభుత్వం, పోలీస్ శాఖ కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల గిరిజనులు ఆధార్ కార్డులు, తాగునీటి సమస్య అధికంగా ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మైనకోట నుంచి జాజిగొంది వరకు రోడ్డు కావాలని సప్తగూడ గ్రామానికి గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ సరకులు సక్రమంగా అందడం లేదంటూ గిరిజనులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

‘మధ్యాహ్న భోజన’ బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న నిర్వాహకులు

జి.మాడుగుల, మే 30 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న బోజన పథకం బిల్లులు చెల్లించాలని నిర్వాహకులు ఎల్. చిన్నారావు, వై. సూరిబాబు, వి. నూకరాజు, చంటిబాబు, క్రిష్ణవేణి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు మాట్లాడు తూ, జనవరి నుంచి ఏప్రిల్ వరకు బకాయి ఉందన్నారు. అప్పులచేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలు అందించి, ప్రస్తుతం అవస్థలు పడుతున్నట్టు వారు ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలల ప్రారంభానికి ముందే బకాయి బిల్లులు చెల్లించాలని వారు విజ్ఞప్తి చేశారు.

పండగ వాతావరణంలో రేషన్ బియ్యం పంపిణీ: తహసీల్దార్


మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీఆర్ డిపోల ద్వారా జూన్ ఒకటి నుంచి రేషన్ బియ్యం, నిత్యావసర సరకుల పంపిణీని పండగ వాతావరణంలో ప్రారంభించాలని తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూప్రభుత్వ ఆదేశాలతో రేషన్ బియ్యం చౌక ధరల దుకాణాల ద్వారా పంపణీకి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వీఆర్వోలు, సేల్స్‌మన్లు రేషన్‌ను ప్రజాప్రతినిధులను పిలిచి ఈ పంపిణీ ప్రారంభించాలన్నారు. పంపిణీపై ప్రజలకుముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. నెలలో 17రోజులు కచ్చితంగా దుకాణాలు తెరచివుంచాలన్నారు. అలాగే భూ ఆక్రమణలపై చర్యలు ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను కార్యదర్శి, వీఆర్వోలు సర్వే చేపట్టి నివేదిక రూపొందించాలన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వ్యక్తులకు నోటీసులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ప్రజలకు వీఆర్వోలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

‘టీడీపీ హయాంలోనే గిరిజన ప్రాంత అభివృద్ధి’


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ముంచంగిపుట్టు, మే 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ హయాంలోనే గిరిజన ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని టీడీపీ మండల నేతలు అన్నారు. శుక్రవారం వారు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మండలంలో పలు అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతం అభివృద్ధిని గాలికి వదిలేసిందని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు విమర్శలకు దిగుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వి.లక్ష్మణ్, కె.శివకుమార్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథ్, నేతలు ముకుందు పడాల్, చిన్నిబాబు, రామారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ మోడల్ టెస్ట్ రేపు

పాడేరు, మే 30 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థుల కోసం జూన్ ఒకటో తేదీన జిల్లా కేంద్రం పాడేరులో మోడల్ టెస్ట్ నిర్వహిస్తామని పీఆర్‌టీయూ నేత లు కొర్రా మోహనరావు, అప్పలరాజు, హేమలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీకి ప్రిపేరవుతున్న అభ్యర్థులకు మరింత మేలు చేసేదిగా ఉండాలనే లక్ష్యంతోనే స్థానిక అక్షర హైస్కూల్‌లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు మోడల్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పీఆర్‌టీయూ నేతలు కోరారు.

ప్రకృతి కేన్వాస్‌పై వర్ణచిత్రం!


ఆకట్టుకుంటున్న వి.కోడపల్లి వద్ద పరిసరాలు

జి.మాడుగుల, మే 30 (ఆంధ్రజ్యోతి): మన్యం ప్రకృతి అందాలకు పుట్టినిల్లు. కొండవాలులో పరుచుకున్న పచ్చదనం, రహదారుల ఇరువైపులా పూలతో స్వాగతం పలుతూ ఎంతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం పాడేరు- జి.మాడుగల ప్రధాన రహదారిలో వి.కోడపల్లి గ్రామం పచ్చని చెట్లు, పూలతో రమణీయంగా ఉన్నది. వర్షాలు కురవడంతో పలు చెట్లు వివిధ వర్ణాల పుష్పాలతో అలంకరించుకున్నాయి. ఈ గ్రామం వద్ద ప్రకృతి సోయగాలతో ఆకట్టుకుంటోంది. ఈ మార్గంలో ప్రయాణించే పర్యాటకులు స్థానికులు ఈ అందమైన చోట్ల ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.రాజ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రావికమతం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.రాజ్‌కుమార్ చెప్పారు. మండలంలోని దొండపూడి, మత్స్యవానిపాలెం, జడ్.బెన్నవరం గ్రామాల్లో శుక్రవారం రైతులతో జరిగిన ప్రత్యేక సంభాషణ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగా సాగు విధానంపై రైతులు అనుసరించాల్సిన అంశాలను వివరించారు. వరి సాగు చేసే భూముల్లో జీవన, పచ్చిరొట్ట ఎరువుల పెంపకం వల్ల కలిగే లాభాలను తెలిపారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేసుకోవడం రైతులు లాభదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డి.ఉమామహేశ్వరావు, శాస్త్రవేత్తలు టి.కిరణ్‌కుమార్, ఎన్.సత్తిబాబు, జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత, మండల వ్యవసాయాధికారి డి.రూప, టీడీపీ నేత వి.వెంకటాచారి పాల్గొన్నారు.

రామాలయాన్ని సందర్శించిన చిన్నజీయర్‌స్వామి



దళిత కాలనీలో రామాలయాన్ని సందర్శించిన చిన్నజీయర్‌స్వామి

గొలుగొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దళిత కాలనీలో రామాలయాన్ని చిన్నజీయర్‌స్వామి శుక్రవారం సందర్శించారు. రాములవారిని దర్శించుకున్న అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడారు. ఇక్కడ యువతీ యువకులకు మొబైల్ రిపేరింగ్, ఎలక్ట్రికల్ పరికరాల మరమ్మతులకు శిక్షణ ఇచ్చే సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు ఈ సందర్భంగా చినజీయర్‌స్వామి చెప్పారు. దీంతో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు కె.లక్ష్మీనారాయణ, జె.నరసింహమూర్తి పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న రాణి కుమారిదేవ్



మోదకొండమ్మను దర్శించుకున్న మాడుగుల కోట మహారాణి

మాడుగుల, మే 30 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మను మాడుగుల కోట రాణి మాయాంక్‌కుమారిదేవ్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుతో పాటు కమిటీ సభ్యులు శ్రీనాధు శ్రీనివాసరావు, దంగేటి సూర్యారావు, భీమరశెట్టి పైడయ్యనాయుడు ఆమెకు ఆహ్వానం పలికి అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అలాగే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శాలువా కప్పి అమ్మవారి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. అమ్మవారి జాతర చల్లని వాతావరణంలో వైభవంగా నిర్వహించాలని ఈ సందర్భంగా చైర్మన్ అప్పలరాజుకు ఆమె సూచించారు.

అమ్మవారి జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయండి

▸▸ ఎంపీపీ వెంకటరాజారాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారాం, పక్కన అధికారులు

మాడుగుల, మే 30 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మను జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారాం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలోఆయన మాట్లాడారు. వచ్చే నెల 3న జరిగే అమ్మవారి జాతరకు సంబంధించి ఏర్పాట్లు సక్రమంగా జరగాలని చెప్పారు. జాతర ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పార్కింగ్ విషయమై పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ జి.నారాయణరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ నిర్వాకం.. రోడ్డున పడ్డ కుటుంబం

ఇంటి పట్టా తనఖా పెట్టి ప్రైవేటు బ్యాంకులో రుణం

వాయిదాలు కట్టకపోవడంతో తాళం వేసిన బ్యాంకు సిబ్బంది



కొత్తఎల్లవరంలో ఇంటికి తాళాలు వేసిన ప్రైవేటు బ్యాంకు సిబ్బంది

గొలుగొండ, మే 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన వలంటీర్ నిర్వాకంతో ఓ కుటుంబం రోడ్డున పడింది. తమ ఇంటిపై ప్రైవేటు బ్యాంకులో రుణం తీసుకుని వాయిదాలు చెల్లించకపోవడంతో సిబ్బంది తాళాలు వేసేశారు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తఎల్లవరం పంచాయతీలో వైబోయిన లక్ష్మికి వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇంటి పట్టా మంజూరు చేసింది. దీంతో ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. అదే గ్రామంలో రొంగల తాతాజీ వలంటీర్‌గా పనిచేస్తూ లక్ష్మికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాను నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో తనఖాపెట్టి రూ.4 లక్షల రుణం పొందినట్టు బాధితులు తెలిపారు. తొమ్మిది వాయిదాలు చెల్లించి ముఖం చాటేయడంతో ఇప్పుడు బ్యాంకు సిబ్బంది వచ్చి తాళం వేసేశారు. దీనిపై వలంటీర్‌ను నిలదీయగా ఇష్టం వచ్చిన వారితో చెప్పుకోండని తెలిపాడని బాధితులు వాపోయారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు చెప్పారు.



సీఎంఆర్ సమీపంలో రోడ్డు మీద పారుతున్న మురుగు నీరు



ఎస్‌కేపీటీ సెంటర్‌లోని రహదారిపై పారుతున్న వర్షం నీరు

వర్షం పడితే ఊరంతా వరదే..!

▸▸ పట్టణంలో ప్రధాన రహదారులు జలమయం

▸▸ మోకాళ్ల లోతులో మురుగు నీటి ప్రవాహం

నర్సీపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): వర్షం పడితే పట్టణాన్ని వరద ముంచెత్తుతున్నది. శుక్రవారం మధ్యాహ్నం రెండున్నర గంటల పాటు కురిసిన భారీ వర్షానికి మెయిన్ రోడ్డులో భారీగా వరద నీరు ప్రవహించింది. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు ఏరులై పారింది. బంగార్రాజు థియేటర్ రోడ్డు, వెంకునాయుడుపేట మెయిన్



బంగార్రాజు థియేటర్‌కి వెళ్లే రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు



వెంకునాయుడపేటలో ముంచెత్తిన వర్షం నీరు

రోడ్డు, ఎంపీపీ స్కూల్ రోడ్డు, శారదానగర్ రెండో లైన్, బ్యాంక్ కాలనీలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. మోకాళ్ల లోతులో నీరు పారింది. వెంకునాయుడపేట ఎంట్రన్స్ మార్గంలోని విత్తనాలు దుకాణంలో వరద నీరు చేరడంతో తోడుకోవల్సి వచ్చింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో వారు నరకం చూశారు.

గిరిజన గ్రామాల్లో అంధకారం

▸▸ జీలుగులోవ, పశువులబందలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

▸▸ మూడు నెలల క్రితం కూలిపోయిన విద్యుత్ స్తంభాలు

▸▸ పట్టించుకోని అధికారులు.. గిరిజనుల అగచాట్లు

రావికమతం, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు నేలకొరిగి మూడు నెలలు గడిచినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కొండ శిఖర గిరిజన గ్రామాలు జీలుగులోవ, పశువులబంద అంధకారంలో మగ్గుతున్నాయి. రావికమతం-వి.మాడుగుల సరిహద్దులో సామలమ్మ కొండపై ఈ రెండు గిరిజన గ్రామాలున్నాయి. ఇక్కడి గిరిజనుల అభ్యర్థన మేరకు 2024 డిసెంబరులో జన్‌ధన్ పథకం ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించారు. 57 విద్యుత్ స్తంభాలను కొండ దిగువ నుంచి కొండపైనున్న ఈ గ్రామాలకు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఈ ఆనందం ఆదివాసీల్లో ఎంతో కాలం నిలువ లేదు. స్తంభాల నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతో నాలుగు నెలల వ్యవధిలోనే నాలుగు స్తంభాలు నేలమట్టమయ్యాయి. దీంతో రెండు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చీకట్లో అడవి జంతువుల భయంతో ఇళ్ల నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ ఏఈకి పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని గిరిజన సంఘం అధ్యక్షుడు శ్రీధర్ కామేశ్వరావు, సీపీఎం నాయకుడు కె.గోవిందరావు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే గ్రామాలకు విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలని, లేకుంటే నర్సీపట్నం విద్యుత్ కార్యాలయం వద్ద ఆదివాసీలతో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.





గిరి శిఖర గ్రామాలకు వెళ్లే మార్గంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇటీవలే తాను ఇక్కడికి వచ్చానని, ఈ విషయం ఇంత వరకూ తన దృష్టికి రాలేదని చెప్పారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఈ గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన చెప్పారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం!

ఈదురుగాలులలో పలు చోట్ల నేలకొరిగిన చెట్లు

గొలుగొండ/కృష్ణాదేవిపేట/మాకవరపాలెం/రావికమతం/దేవరాపల్లి/చీడికాడ, మే 30(ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ప్రధానంగా గొలుగొండ, మాకవరపాలెం, రావికమతం, దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో వర్షం దంచి కొట్టింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన హోరున వాన పడింది. గొలుగొండ, చీడిగుమ్మల, జోగంపేట, పాకలపాడు, రావణాపల్లి, ఏటిగైరంపేట, గుండుపాల, కొత్తమల్లంపేట, అమ్మపేట, కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, కొంగసింగి, చోద్యం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏఎల్‌పురం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో వర్షం నీరు ఎటూ పోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు



గొలుగొండలో భారీగా కురుస్తున్న వర్షం



మాకవరపాలెం రహదారిపై కూలిపోయిన చెట్టు

పడ్డారు. అలాగే మాకవరపాలెం మండలంలో ఈదురుగాలులతో వాన పడింది. దీంతో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. రావికమతం మండలంలో మూడు రోజులుగా రోజూ వర్షం కురుస్తున్నది. శుక్రవారం ఉదయం నుంచి తీవ్రమైన ఎండతో ప్రజలు ఉక్కపోతకు అల్లాడిపోయారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వాన పడింది. దీంతో వాతావరణం చల్లబడిపోవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. దేవరాపల్లిలో మండలంలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం పడింది. ఉదయం అంతా ఎండ ప్రచండం కాగా, సాయంత్రం ఒక్క సారిగా చల్లబడింది. వర్షం పడడంతో నాగయ్యపేట శివారు సీతంపేట పట్నాల నరసింగరావు ఇంటి సమీంలో కల్వర్టు వద్ద నీరు పోయే మార్గం లేక ఇండ్లలోకి చేరి వస్తువులు, ధాన్యం తడిచిపోయాయి. వర్షం వస్తే ప్రతీసారి ఇదే దుస్థితి దాపురిస్తున్నదని ప్రజలు వాపోయారు. అలాగే శంభువానిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ భవనంపై భారీ చింత చెట్టు కూలిపోయింది. ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టు కింద పార్కింగ్ చేసిన గ్రామానికి చెందిన నాయుడుకు కారు దెబ్బతింది. వేసవి సమయంలో ఎక్కువ మంది ఆ చెట్టు కింద సేద తీరుతుంటారు. దానికితోడు అంగన్‌వాడీ కేంద్రం పని వేళలు కాకపోవడం పెద్ద ప్రమాదం తప్పింది. వర్షాలకు పొలాలు, రహదారులపై నీరు ఏరులై పారింది.

చీడికాడ మండల కేంద్రం పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఉక్కపోత, మండుతున్న ఎండతో తీవ్ర ఇబ్బందులకు ప్రజలు గురయ్యారు. అనంతరం గాలి వర్షం కురవడంతో చల్లదనానికి ఉపశమనం పొందారు.



దేవరాపల్లి: సీతంపేట గ్రామంలోని ఓ ఇంటిలో చేరిన వర్షం నీరు



కృష్ణాదేవిపేటలో హోరున కురుస్తున్న వాన

ఆర్టీసీ పనితీరుపై డీఎం తనిఖీలు

దేవరాపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సేవలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయోనని విశాఖపట్నంలోని మద్దిలపాలెం డిపో మేనేజరు ఎస్.అరుణకుమారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. దేవరాపల్లి, వాకపల్లి, ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి గ్రామాల్లో అసిస్టెంట్ డిపో మేనేజరు ఎం.మాధురితో కలసి పర్యటించారు. నేరుగా గ్రామ ప్రజలు, ప్రయాణికులతో మాట్లాడి ఆర్టీసీ సేవలపై ఆరాతీశారు. వాకపల్లిలో రెండు పూటలా బస్ తిరగడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఎ.కొత్తపల్లిలో గ్రామస్థులతో సమావేశమయ్యారు. సర్పంచ్ చింతల వెంకటరమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

'యోగా డే'కు 20 వేల మంది పేర్ల నమోదు

నర్సీపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొనడానికి పట్టణ పరిధిలో 20 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారని కమిషనర్ జంపా సరేంద్ర తెలిపారు. నలంద పాఠశాలలో జరుగుతున్న యోగా శిక్షణా శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు యాప్‌లో పేర్లు నమోదు చేస్తున్నారని చెప్పారు. పేర్లు నమోదు చేసుకున్న వారంతా రాష్ట్రంలో ఎక్కడైనా వరల్డ్ యోగా డేలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. ప్రతి రోజూ యోగా శిక్షణ ఇప్పిస్తున్నామని, యోగా నేర్చుకున్న వారు మిగిలిన వారికి నేర్పిస్తారని చెప్పారు.

అల్లూరి పార్కులో అభివృద్ధి పనులను ఎంపీలకు వివరిస్తా

▸▸ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కృష్ణాదేవిపేట, మే 30: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు అభివృద్ధి పనులను త్వరలో ఎంపీలకు వివరిస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. తన అభ్యర్థన మేరకు రూ.20 లక్షల నిధులు ఇచ్చిన ఇద్దరు ఎంపీలకు శుక్రవారం ఆయన లేఖ ద్వారా ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాజ్యసభ సభ్యులు మస్తాన్‌రావు చెరో రూ.10 లక్షలు కేటాయించడంతో ధన్యవాదాలతో పాటు ప్రస్తుతం ఆ నిధులతో పార్కులో ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలనేది లేఖలో ప్రస్తావించామని ఈ సందర్భంగా అయ్యన్న చెప్పారు. త్వరలో పార్కులో పై నిధులతో పనులు ప్రారంభించనున్నట్టు చెప్పారు.

బైక్ ర్యాలీ జయప్రదం చేయాలి

నర్సీపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చనందుకు జూన్ 4 నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీబీఎం కార్యాలయం నుంచి పెదబొడ్డేపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని చెఆప్పరు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బంగారు తాడు చోరీ

చోడవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తూరు జంక్షన్ సమీపంలో గూనూరు రామలక్ష్మి మెడలో రెండు తులాల బంగారు తాడును గుర్తుతెలియని మహిళలు అపహరించారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కొత్తూరు జంక్షన్ నుంచి సమీపంలో ఉన్న తన ఇంటికి వెళుతున్న రామలక్ష్మిని ఇద్దరు మహిళలు వచ్చి ఆటో ఎక్కించుకున్నారు. ఇంటి దగ్గర దించుతామని ఎక్కించుకొని కొద్ది దూరం ఆటో నుంచి దించి వెళ్లిపోయారు. తీరా ఆటో బయలుదేరే సమయానికి ఆమె మెడలో రెండు తులాల తాడును మహిళలు లాక్కుని పరారయ్యారు. దీనిపై వృద్ధురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డీఎస్సీ నమూనా పరీక్ష రేపు

నర్సీపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ రాసే అభ్యర్థుల కోసం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం డీఎస్సీ నమూనా ప్రవేశ పరీక్ష ఏర్పాటు చేసినట్టు జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అనకాపల్లి ఎంజీహెచ్ఎస్, నర్సీపట్నం, గోపాలపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలు, పాడేరు అక్షర పబ్లిక్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు నాతవరంలో వైద్య శిబిరం

నాతవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశాని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తామని వారు చెప్పారు.

2న ఊయ్యాలరాట్ల సంబరం

నాతవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నాతవరంలో వచ్చే నెల 2వ తేదీన కోటమ్మతల్లి జాతరలో భాగంగా ఊయాలరాట్ల సంబరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అదే రోజు శక్తి వేషాలు, గరగల డాన్స్‌కేరళ డ్రమ్స్, కరీంనగర్ వారితో డప్పుల డాన్స్ చింతలపాలెం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే మంగళవారం కోటమ్మతల్లి పండగను నిర్వహిస్తామన్నారు. రెండేళ్లకోకసారి జరిగే కోటమ్మతల్లి పండుగకు ఇప్పటి నుంచే భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం

మాకవరపాలెం, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో జూన్ నెల పింఛన్లు పంపిణీకి అంతా సిద్ధంగా చేశామని ఎంపీడీవో ఛాయి సుధ తెలిపారు. ఇందులో భాగంగానే శుక్రవారం సిబ్బందితో మాట్లాడారు. మండలంలో మొత్తం 9,894 మందికిగాను రూ.4.84 లక్షలు పంపిణీ చేస్తామన్నారు. అలాగే కొత్తగా 31 పంచాయతీలకు 125 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. వీటిని ఈ నెల నుంచి పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.

కొనసాగుతున్న యోగా శిక్షణ

రోలుగుంట, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రోలుగుంట జడ్పీ పాఠశాలలో మండల స్థాయి యోగా శిక్షణా తరగతులు శుక్రవారం నాలుగో రోజుకు చేరాయి. ఈ శిక్షణ శిబిరంలో మాస్టర్ ట్రైనర్లు పాల్గొని గ్రామ స్థాయి శిక్షకులకు యోగా గురించి వివరించారు. మండల స్థాయిలో శిక్షణ పొందిన వారంతా 24 పంచాయతీల్లో ప్రతీ పంచాయతీలో యోగా శిక్షణ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంఈవో జగ్గారావు పాల్గొన్నారు.

వారపు సంతపై శీతకన్ను

నిర్వహణను గాలికొదిలేసిన ఎలమంచిలి మునిసిపాలిటీ అధికారులు



వర్షంతో బురదమయమైన సంత, సంచరిస్తున్న పందులు



సంతను వదిలి.. రోడ్డు పక్కన దుకాణాలు పెట్టుకున్న చిరువ్యాపారులు

- వర్షం కురిస్తే నిలిచిపోతున్న నీరు
- బురదమయం అవుతుండడంతో చిరువ్యాపారులు, వినియోగదారుల ఇక్కట్లు
- రోడ్డు పక్కకు దుకాణాలు తరలింపు
- సంతలో ఎప్పటికప్పుడు తొలగించని వ్యర్థాలు
- కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన
- రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా.. పట్టించుకోని అధికారులు

ఎలమంచిలి, మే 30 (ఆంధ్రజ్యోతి):

స్థానిక మునిసిపాలిటీకి ఏటా లక్షలాది రూపాయల ఆదాయాన్ని ఇచ్చే ధర్మవరం వారపు సంత నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. కొద్దిపాటి వర్షం కురిసినా నీరు నిలిచిపోయి బురదమయం అవుతున్నది. దీంతో చిరు వ్యాపారులు పక్కనే వున్న రోడ్డుపై దుకాణాలు పెట్టుకుని అమ్ముకోవాల్సి వస్తున్నది. అయినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ ఆశీలు వసూలు చేస్తున్నారు. ఇక సంత ప్రదేశంలో కూరగాయలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది.

పట్టణంలోని ధర్మవరంలో ప్రతి గురువారం సంత జరుగుతుంది. ఇక్కడకు ఎలమంచిలి, ఎస్.రాయవరం, రాంబిల్లి మండలాలకు చెందిన చిరువ్యాపారులు వచ్చి, దుకాణాలు పెట్టుకుని కూరగాయలు, చేపలు, నాటుకోళ్లు, చికెన్, మటన్, చిన్నపాటి వ్యవసాయ పరికరాలు విక్రయిస్తుంటారు. ఇందుకుగాను ఆశీలుపాట దారునికి నిర్ణీత మొత్తంలో రుసుము చెల్లించాలి. ఈ సంతతోపాటు కూరగాయల మార్కెట్,



సంత స్థలంలో పేరుకుపోయిన చెత్త

పట్టణంలో పలుచోట్ల రోడ్లపక్కన చిరువ్యాపారాలు చేసుకుని వారి నుంచి కూడా ఆశీలు వసూలు చేసుకోవడానికి మునిసిపాలిటీ అధికారులు ఏడాదికోసారి వేలం పాట నిర్వహిస్తుంటారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆశీలు వసూలు కోసం సుమారు రూ.24 లక్షలకు ఓ వ్యక్తి పాడుకున్నారు. మునిసిపాలిటీకి ఇంత ఆదాయం వస్తున్నప్పటికీ సంతలో రేకుల షెడ్లు మినహా మిగిలిన సౌకర్యాలు కల్పించలేదు. సుమారు ఎకరా విస్తీర్ణంలో సంత నిర్వహించే ప్రదేశం లోతట్టుగా వుండడంతో వర్షం కురిస్తే నీరు నిలిచిపోతున్నది. మట్టి ప్రదేశం కావడంతో బురదమయమై వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతున్నది. దీంతో చిరువ్యాపారులు పక్కనే వున్న రోడ్డు పక్కన అమ్ముకోవాల్సి వస్తున్నది. ఫలితంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. రోడ్డు పక్కన అందరికీ సరిపడ స్థలం లేకపోవడంతో కొంతమంది వ్యాపారులు బురదగా వున్న సంతలోనే వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీనివల్ల కొనుగోలుదారులు రాకపోవడంతో తమ వ్యాపారాలు సాగడం లేదని వాపోతున్నారు. దీనికితోడు సంతలో వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నది. చిరువ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. సంత ద్వారా మునిసిపాలిటీకి లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ నిర్వహణను పట్టించుకోవడంలేదని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు 16 వరకు దరఖాస్తు

అనకాపల్లి అగ్రికల్చర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే వ్యవసాయ, అగ్రి ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసిందని స్థానిక ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 16వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులతోపాటు ఇంటర్మీడియట్ పూర్తి చేయని విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ పరిశోధన స్థానం పనివేళల్లో 83310 70288 లేదా 9966 24225 నంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

రోడ్డు మధ్యలో కూరుకుపోయిన క్వారీ లారీ

- నాలుగు గంటలపాటు నిలిచిన ట్రాఫిక్



కూరుకుపోయిన క్వారీ లారీని క్రేన్లతో బయటకు తీస్తున్న దృశ్యం

రావికమతం, మే 30 (ఆంధ్రజ్యోతి): రావికమతం- తట్టబంద (ఆర్‌ఈసీ) రోడ్డు మధ్యలో దాసరయ్యపాలెం వద్ద క్వారీ లారీ కూరుకుపోయింది. దీంతో నాలుగు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు గొంపకొండ క్వారీ నుంచి రాళ్ల లోడుతో లారీ రావికమతం వైపు వస్తుండగా దాసరయ్యపాలెం వద్ద గొయ్యిలో కూరుకుపోయింది. దీంతో లారీని ట్రాక్టర్లతో పైకి తీసేందుకు లారీ సిబ్బంది,గ్రామస్థులు ప్రయత్నించినా బయటకు రాలేదు. అనంతరం అనకాపల్లి నుంచి మూడు భారీ క్రేన్లలను రప్పించి లారీని రాత్రి 8.30 గంటలకు బయటకు తీశారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది. ఇప్పటికైన ఆర్‌టీఏ, పోలీస్ అధికారులు మితిమీరిన బరువుతో నడుపుతున్న లారీలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జూలై 9న సింహగిరి ప్రదక్షిణ

- ఈఓ వేంద్ర త్రినాథరావు
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష



అధికారులతో సమావేశమైన ఈఓ త్రినాథరావు.

సింహాచలం, మే 30 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి ప్రదక్షిణ ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలతో కృషి చేయాలని దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు సూచించారు. జూలై 9న జరిగే గిరి ప్రదక్షిణ ఉత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయన దేవస్థానానికి చెందిన అన్ని విభాగాల అధికారులతో సింహగిరిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవంలో లక్షలాది మంది పాల్గొనున్నారని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అందుకు తగిన ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పని చేయడం వల్ల ఉత్సవాన్ని విజయవంతం చేయవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈఓ సంగం రాధ, భూపరిరక్షణ విభాగం అధికారి గీతాంజలి, ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఏఈఓలు ఆనందకుమార్, పిళ్లా శ్రీనివాసరావు, నరసింహరాజు, ఈఈ బండారు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో దేశ సేవ చేయాలి

- త్రిదండి చిన్న జీయర్ స్వామి పిలుపు
- 108 సామూహిక వివాహ వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి పాల్గొన్న స్వామి



అల్లూరి మ్యూజియంలో చిత్రపటాలను తిలకిస్తున్న చిన్న జీయర్‌స్వామి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు



కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో సమాధులను పరిశీలిస్తున్న చిన్న జీయర్ స్వామి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కృష్ణాదేవిపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అల్లూరి సీతారామరాజును సమాధి చేసిన కృష్ణాదేవిపేటలో సామూహిక వివాహ మహోత్సవం జరపడం శుభప్రదమని త్రిదండి చిన్న జీయర్‌స్వామి అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట శివారులోని తంగేటి శ్రీనివాసా కల్యాణ మండంలో 108 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహాలను వికాస తరంగిణి కేంద్ర కమిటీ, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సామూహిక వివాహాలకు చిన్నజీయర్ స్వామి ప్రత్యేక పర్యవేక్షకునిగా హాజరయ్యారు. తొలుత ఉదయం 9గంటలకు చెక్కా వెంకట కల్యాణ మండపంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, భక్తులకు ఆయన తులసి తీర్థం అందించారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి స్థానిక అల్లూరి పార్కును సందర్శించారు. అనంతరం తంగేటి శ్రీనివాసా కల్యాణ మండపం చేరుకుని వివాహ జంటలను ఆశీర్వదించారు. ముత్యం, పగడంతో కూడిన 3 గ్రాముల బంగారు శతమానం ప్రతీ జంటకు త్రిదండి చిన్న జీయర్ స్వామి స్వయంగా అందించారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ శ్రీరామచంద్రుడు జన్మించిన ఈ నక్షత్రంలో కల్యాణం జరుపుకోవడం ఎంతో మంచిదన్నారు. మంచి గడియలలో వివాహం జరుపుకుంటున్న మీరంతా పుణ్య దంపతులు కాగలరన్నారు. ట్రస్టు సభ్యుడైన గుండా మల్లయ్య తన మిత్రులతో కలిసి రూ.20 లక్షల విలువైన బంగారు సూత్రాలు 108 వివాహ జంటలకు అందించడం శుభపరిణామమన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, తెలంగాణ నుంచి వేదపండితులు ఆశీర్వదించడానికి రావడం మీ అదృష్టమన్నారు. మీ సంతానానికి మంచిని నేర్పండి.. దేశ ప్రగతిలో భాగస్వాములయ్యేలా పెంచాలని చిన జీయర్ స్వామి ఆకాంక్షించారు.

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఆదివాసీ జంటలకు కన్నుల పండవగా వివాహాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇందులో తనను భాగస్వామిని చేయడం అదృష్టమన్నారు. భద్రత ఏర్పాట్లను నర్సీపట్నం డీఎస్పీ పోతులూరి శ్రీనివాసరావు, నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్ఐలు వై.తారకేశ్వరరావు, రామారావు, ఇతర సిబ్బంది చేపట్టారు. సుమారు 12 వేల మందికి విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి కేంద్ర కమిటీ, దానధర్మ చారిటబుల్ ట్రస్టు వూటుకూరి వెంకట్, రాజా, ఉల్లి అనిల్‌కుమార్, రాట్నాల సూర్య, డీవీడీ ప్రసాద్, నర్సీపట్నం నియోజకవర్గ జనసేన నాయకుడు రాజాన సూర్యచంద్ర, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ గొలుగొండ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వివాహ వేదిక వద్ద మాట్లాడుతున్న చిన్న జీయర్ స్వామి

విద్యుత్ సరఫరా మెరుగుకు కసరత్తు

... 3వ పేజీ తరువాయి

తగ్గించి కొత్త ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నారు. భీమునిపట్నం నియోజకవర్గంలో గంధవరం, పాండ్రంకి, పెద్దిపాలెం, కోరాడ, శిర్లపాలెం, గోస్తనీ, వెల్లంకి, శొంఠ్యాం, రేవిడి, రెడ్డిపల్లిల్లో కొత్త ఫీడర్లు పెడుతున్నారు. వీటికి సుమారు రూ.35 కోట్ల నుంచి రూ.40 కోట్లను వెచ్చిస్తున్నారు. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే పూర్తికాగా మరికొన్ని జూన్ 10వ తేదీ నాటికి పూర్తి కానున్నాయి. వీటన్నింటినీ జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు విశాఖ సర్కిల్ ఎస్ఈ శ్యామ్‌బాబు తెలిపారు. అలాగే వేసవిలో విద్యుత్ సరఫరా మెరుగుకు చిల్లపేట, సుద్దగెడ్డ, తెన్నేటి నగర్, కూర్మన్నపాలెం, తదితర ప్రాంతాల్లో ఐదు కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, వీటికి ఒక్కోదానికి రూ.3.5 కోట్లు వెచ్చించామన్నారు.

అనకాపల్లి డివిజన్ విషయానికి వస్తే 61 విద్యుత్ ఫీడర్లలో 43 ఫీడర్లను కేవలం వ్యవసాయ కనెక్షన్ కోసం ప్రత్యేకంగా విభజిస్తున్నారు. సాధారణ గృహ విద్యుత్ అవసరాల కోసం అదనపు ఫీడర్లను పెడుతున్నారు. ఈ పనుల కోసం సుమారు రూ.125.5 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ పనులు చేపట్టడానికి వారంలో ఒకటి రెండు రోజులు విద్యుత్ సరఫరాను కొద్ది గంటలపాటు నిలిపివేస్తున్నారు. ఈ విషయాన్ని పత్రికల ద్వారా ముందుగానే ప్రజలకు తెలియజేస్తున్నారు. ఎలమంచిలిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఈ పనులు నిర్వహించడానికి గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.10 గంటల వరకు, ఆ తరువాత మళ్లీ 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం సుమారు ఏడు గంటల పాటు పనులు చేపట్టారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అలాగే అచ్యుతాపురం మండంలోని వెదురువాడ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ముందుగానే ప్రకటించారు. అయితే రాత్రి 7.30 గంటల వరకు పనులు జరగడం వల్ల మరో రెండు గంటలు అదనంగా సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందని అనకాపల్లి డివిజన్ ఈఈ రాజశేఖర్ తెలిపారు. టవర్ల పైనుంచి విద్యుత్ వైర్లను లాగడం వల్ల ఎక్కువ సమయం పట్టిందన్నారు. ఇప్పుడు ఈ పనులు చేపట్టడం వల్ల వచ్చే పదేళ్ల వరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతామని పేర్కొన్నారు. వాస్తవానికి ప్రతి శుక్రవారం నిర్వహణ పనుల కోసం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని, ఇప్పుడు కొత్త పనులు చేపట్టడం వల్ల ఇంకో రోజు సరఫరా ఆగుతోందని వివరించారు. డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా ఉందని, పనులు పూర్తయిన తరువాత 24/7 సరఫరా జరుగుతుందన్నారు.

కుండపోతగా వాన!

... 3వ పేజీ తరువాయి

చెబుతున్నారు. నక్కపల్లి మండలం శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటసేపు ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కోటవురట్ల మండలంలో శుక్రవారం మధ్యాహ్నం తరువాత సుమారు రెండు గంటలపాటు కుండపోతగా వర్షం పడింది. గెడ్డలు, వాగుల్లో వరద నీరు ప్రవహించింది. చెరువుల్లోకి కొత్తనీరుచేరుతున్నది. అడ్డరోడ్డు- నర్సీపట్నం మెయిన్ రోడ్డులో పలుచోట్ల నీరు నివలడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. 77.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. ఎస్.రాయవరం మండలం వ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నం సుమారు గంటన్నరపాటు భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో రహదారులు చెరువులను తలపించాయి. గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములతో మోస్తరు వర్షం పడింది.



దేవరాపల్లి మండలం సీతంపేటలో ఇళ్లల్లోకి చేరిన వర్షం నీరు

క్రైం... crime news

మేడ పైనుంచి పడి యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ప్రమాదవశాత్తూ మేడ పైనుంచి పడి తీవ్ర గాయాలతో మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ సంతోశ్‌కుమార్ అందించిన వివరాలిలా వున్నాయి. పట్టణంలోనిఇ లక్ష్మీదేవిపేట గొల్లవీధికి చెందిన శివకోటి మహేశ్ (32) ఆటో డ్రైవర్‌గా జీవనోపాధి పొందుతున్నాడు. వేసవి కావడంతో రోజు మాదిరిగానే గురువారం రాత్రి భోజనం చేసిన తరువాత పిట్టగోడ లేని మేడపై నిద్రపోయాడు. గాఢ నిద్రలో వున్నప్పుడు పొరపాటున పక్కకు జరగడంతో మేడ మీద నుంచి కింద పడ్డాడు. పెద్ద శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు నిద్ర లేచి చూడగా మహేశ్ తీవ్ర గాయాలతో కనిపించాడు. ఆస్పత్రికి తరలించడానికి 108కు ఫోన్‌చేశారు. కొద్దిసేపటి తరువాత అంబులెన్స్ వచ్చింది. సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. మహేశ్ అన్న సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పెయింటింగ్ వేస్తుండగా కాలుజారి పడి ఒకరి మృతి

నక్కపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినతీనార్ల గ్రామంలో ఒక వ్యక్తి తన ఇంటికి రంగులు వేస్తుండగా జారిపడి మృతిచెందాడు. సీఐ కుమారస్వామి తెలిపిన సమాచారం ప్రకారం.. చినతీనార్లకు చెందిన సిరిపల్లి మరియయ్య (45) ఇటీవల తన ఇంటి మరమ్మతు పనులు చేపట్టారు. శుక్రవారం పెయింటింగ్ వేస్తుండగా కాలుజారి పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

యువకుల మధ్య కొట్లాట

- ఒకరికి తీవ్ర గాయాలు

రావికమతం, మే 30 (ఆంధ్రజ్యోతి):

రావికమతంలో మద్యం మత్తులో ఇద్దరు యువకుల మధ్య తలెత్తిన ఘర్షణ కత్తితో దాడికి దారి తీసింది. రావికమతంకు చెందిన కంచిపాటి స్వామి, మత్స్యవానిపాలెంకు చెందిన మహేష్ (నూకాంబిక వైన్స్‌లో పార్టనర్) మధ్య గురువారం రాత్రి రామ్‌గని దాబా వద్ద స్వల్ప వివాదం చోటుచేసుకుంది. దీంతో మహేష్ స్వగ్రామమైన మత్స్యవానిపాలెం నుంచి నలుగురు యువకులను రప్పించి అంతా కలసి స్వామిపై ఎంజీ వైన్స్ దగ్గరలో గొడవకు దిగి చాకుతో దాడి చేసి, గాయపర్చారని స్వామి తెలిపారు. దీంతో స్వామి శరీరంపై చాతి, పొట్టపైన, కుడిచేయిపైన గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన స్వామిని స్థానికులు రావికమతం పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా.. ప్రాథమిక చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడే చికిత్స పొందుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న రావికమతం ఎస్ఐ ఎం.రఘువర్మ శుక్రవారం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వెళ్లి స్వామితో మాట్లాడారు. బాధితుడు ఫిర్యాదు చేయనందున కేసు నమోదు చేయలేదని ఎస్ఐ రఘువర్మ విలేకరులకు తెలిపారు.

రోడ్డుపై రేషన్‌కు చెల్లు చీటీ!

... 3వ పేజీ తరువాయి

విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారు. దీనిపై మీడియాలో కథనాలు వచ్చినా.. అధికారులు పట్టించుకునేవారుకాదు. బియ్యం మాఫియా వెనుక నాటి అధికార పార్టీ నేతలు వుండడమే కారణం. ఈ నేపథ్యంలో గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహన్ రేషన్ పంపిణీపై ప్రత్యేక దృష్టిసారించారు. రాష్ట్రంలో పలుచోట్ల దాడులు నిర్వహించిన గోదాముల్లో భారీ మొత్తంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. తరువాత క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎండీయూ ఆపరేటర్లపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో జూన్ నుంచి ఈ వాహనాలను నిలిపివేసి, రేషన్ డిపోల్లోనే సరకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఆదివారం నుంచి కార్డుదారులు తమకు వెసులుబాటు వున్న సమయంలో రేషన్ డిపోకు వెళ్లి సరకులు విడిపించుకోవచ్చు. దీంతో కార్డుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెలకు సంబంధించి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వున్న ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి అన్ని రేషన్ డిపోలకు 7,606 టన్నుల బియ్యం, 264 టన్నుల పంచదార సరఫరా చేశామని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. సరకులు పంపిణీలో పారదర్శకత కోసం రేషన్ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 65 ఏళ్లపైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే సరకులు అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రేషన్ డీలర్ల సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు.

రేషన్ డిపోలు తెరిచే వేళలు..

ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు రేషన్ దుకాణాలను తెరిచి వుంచి, సరకులు పంపిణీ చేయాలి. కార్డుదారులు ఆయా రోజుల్లో తమకు వెసులుబాటు ఉన్న సమయంలో సరకులు పొందవచ్చు. .

ఏసీబీకి చిక్కిన వాణిజ్య పన్నుల అధికారిణి

... 3వ పేజీ తరువాయి

మెటీరియల్ తీసుకెళ్లడంలో విశ్వనాథ్ కొంత ఆలస్యం చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న డీసీటీవో జయలక్ష్మి గోదామును తనిఖీ చేసి ప్లై ఉడ్ మెటీరియల్‌ను పరిశీలించారు. దీనికి సంబంధించి క్యారియింగ్ ఇన్వాయిస్ లేకపోవడంతో సరకును స్వాధీనం చేసుకున్నారు. దీంతో విశ్వనాథ్.. డీసీటీవో జయలక్ష్మిని కలిసి మెటీరియల్ రిలీజ్ చేయాలని కోరారు. రూ.30 వేలు లంచం ఇస్తేనే రిలీజ్ ఆర్డర్ ఇస్తానని ఆమె స్పష్టం చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని విశ్వనాథ్ ప్రాధేయపడగా.. రూ.25 వేలకు తగ్గించారు. లంచం సొమ్మును తన అనుచరుడైన కాళేశ్వరి ట్రాన్స్‌పోర్టు ఇన్‌చార్జి మామిడిపాక సన్యాసిరాజుకు ఇవ్వాలని ఆమె సూచించారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని విశ్వనాథ్ గురువారం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన మేరకు శుక్రవారం ఉదయం వన్ టౌన్‌లోని గోదాము వద్ద సన్యాసిరాజుకు లంచం డబ్బులు ఇస్తుండగా.. అప్పటికే మాటు వేసి వున్న ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం సన్యాసిరాజును లంకెలపాలెంలో వున్న అచ్యుతాపురం సర్కిల్ డివిజన్-2 వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి తీసుకొచ్చి డీసీటీవో జయలక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. తరువాత కార్యాలయంలో తనిఖీలు చేసి, ఇద్దరినీ అరెస్టు చేశారు. వీరిని విశాఖలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు సుప్రియ, శ్రీనివాస్, లక్ష్మణరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

యువతి హత్య కేసులో వీడిన మిస్టరీ

... 3వ పేజీ తరువాయి

ఆధారాలు లభించలేదు. దీంతో కేసును మరింత లోతుగా దర్యాప్తు చేశారు. ఎలమంచిలి పట్టణానికి చెందిన ముగ్గురు యువకుల పాత్ర వున్నట్టు ఆధారాలు సేకరించారు. ఎలమంచిలిలోని సీపీ పేటకు చెందిన ప్రగడ రవితేజ, ధర్మవరం వీధికి చెందిన సెలంశెట్టి సాయికృష్ణ , కాకివానివీధికి చెందిన బంగారి శివలను ఈ నెల 29వ తేదీన అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, నేరం అంగీకరించినట్టు తెలిసింది. ఎల్లబిల్లి దివ్యకు పలువురితో 'పరిచయం' వుందని, తనతో శారీరక సంబంధం ఏర్పరచుకుందని, పెళ్లి చేసుకోవాలని, లేకపోతే ఇంటికి వచ్చిగొడవ చేస్తానని బెదిరించిందని నిందితుల్లో ఒకరైన ప్రగడ రవితేజ చెప్పినట్టు తెలిసింది. అప్పటికే తాను ఒక అమ్మాయిని ప్రేమించానని, ఆమెతో పెళ్లి చెడిపోతుందేమోనన్న భయంతో దివ్యను అంతమొందించాలని నిర్ణయించున్నట్టు చెప్పాడు. తన స్నేహితులు సెలంశెట్టి సాయికృష్ణ, కా బంగారి శివల సహకారంతో దివ్యను హత్య చేసి, మృతదేహాన్ని కాల్చినట్టు అంగీకరించాడు. రవితేజ, సాయికృష్ణలపై ఎలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసు నమోదై ఉందని, బంగారి శివపై కొట్లాట కేసు ఉందని డీఎస్పీ చెప్పారు. ఈ కేసును ఛేదించిన సీఐ ధనుంజయరావు, పట్టణ ఎస్ఐ సావిత్రి, మునగపాక ఎస్ఐ ప్రసాద్, ట్రైనీ డీఎస్పీని ఆయన అభినందించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539